
# కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక



ఆగస్టు 2011

కొత్తపల్లి తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక ఆగస్టు 2011

**మూలం:** **http://kottapalli.in/2011/08/welcome**

**సంపాదకులు:** నారాయణ

**ముఖచిత్రం:** వీరాంజనేయులు

**అక్షర కూర్పు:** *కొత్తపల్లి,.*

**ముద్రిత ప్రతి వెల: రూ. 20/-**




కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

**ఫోను: 08559 240222, 7702877670 ఇ-మెయిలు: team@kottapalli.in**




# విషయ సూచిక

**ముందుమాట**

స్వాతంత్ర్యపు బీజం...సంపాదకీయం...2

**ధారావాహిక**

నీతిచంద్రిక-22...చిన్నయసూరి...4

**పిల్లలు రాసిన కథలు**

ఎగిరిన నక్క...ప్రగతి...11

దురాశ...అరుణకుమారి...13

రాణి కడుపులో చేప...శ్రీలక్ష్మి...19

మంగయ్య తెలివి...రచన...23

పెద్దల మాట-చద్ది మూట...హర్ష...25

మూడు మంచి పనులు...విశ్వనాథ్...28

**పెద్దలు రాసిన కథలు**

రాజకుమారి-దొంగసాధువు...మహనందప్ప...31

పెద్దపులి బద్ధకం...రాధ...37

నమస్కారం...చిన్నారి...41

మంత్రిపదవి...చక్రి...43

రంగయ్య గాడిద...సమీర...48

**అనువాద కథ**

వినటం చేసిన మేలు...రామానుజన్...52

**పాటలు**

పాలపిట్ట రావే!...జేజిమామయ్య...57

సమతా రాజ్యం...జైసీతారాం...58

**అవీ ఇవీ**

పదరంగం-6...దేవి...59

బొమ్మకు కథ రాయండి!...లలిత...60

చిలిపిప్రశ్నలు-తిక్క జవాబులు...మూర్తి...61

సమీక్ష...మాలతీకృష్ణ...62

# స్వాతంత్ర్యపు బీజం

చాలా కాలం క్రితం ఒక మోహన్ ఉండేవాడు.

అప్పట్లో డబ్బున్నవాళ్ల పిల్లలంతా ఇంగ్లాండ్ లో చదువుకోవాలని కలలు కనేవాళ్ళు.

మోహన్‌దీ అదే కోరిక. అయితే ఆ రోజుల్లో ప్రధానమంత్రుల పిల్లల దగ్గరకూడా మరీ ఎక్కువ డబ్బులు ఉండేవి కావు. మోహన్ ఇంగ్లాండుకు వెళ్ళి తన బట్టలు తనే ఉతుక్కున్నాడు; తన జుట్టు తనే క్షవరం చేసుకున్నాడు; తనవంట తనే వండుకున్నాడు- బానే చదువుకున్నాడు కూడాను. వెనక్కి వచ్చాక మంచి ఉద్యోగమే దొరికింది- మరో దేశంలో.

ఈసారి ఆ దేశానికి వెళ్ళాడు ఉత్సాహంగా. సూటూ, బూటూ వేసుకొని, మంచి టోపీ పెట్టుకొని, విదేశాల్లోఎలా గౌరవనీయుడిలాగా ఉండాలో అంతకంటే బాగా తయారై వెళ్ళాడు, పడవలో. అక్కడ రేవులో దిగి, తను వెళ్ళాల్సిన ఊరికి వెళ్ళే రైలెక్కి కూర్చున్నాడు. చుట్టూ కూర్చున్న విదేశీయులకి మోహన్ వాలకం నచ్చలేదు. నీలి రంగు వేసుకున్న నక్క కనిపించింది వాళ్ళకి. మోహన్‌ని దిగి పొమ్మన్నారు.

"దిగను. నేనూ టిక్కెట్టు కొనుక్కున్నాను మీలాగానే" అన్నాడు మోహన్.

"అయినా కుదరదు- దిగి పోవాల్సిందే" పట్టు పట్టారు వాళ్లు.

"ఎందుకు కుదరదు? నేనూ మీలాంటి వాడినే. నేనూ చదువుకున్నవాడినే" అన్నాడు మోహన్ మొండిగా.

"నీలాంటి కూలీలతో కలిసి ప్రయాణం చేయం" అన్నారు వాళ్ళు, రెచ్చిపోతూ.

"నేను కూలీని కాదు- నేనూ మీలాగా ఇంగ్లీషు మాట్లాడతాను" అన్నాడు మోహన్.

వాళ్ళు నవ్వారు ఎగతాళిగా- "నీ రంగు చూస్తేనే తెలుస్తోంది నువ్వెవరివో. దిగుతావా, లేదా?" అని తన్ని, మెడపట్టి బయటికి గెంటేశారు మోహన్‌ని.

తను ఎక్కాల్సిన రైలు తనను వదిలేసి వెళ్ళిపోయేసరికి, వర్ణ వివక్ష అంటే ఏమిటో తెలిసివచ్చింది మోహన్‌కు. అనుభవిస్తేగానీ ఏదైనా తెలిసిరాదు.

కోపం వచ్చిన మోహన్ ప్రభుత్వాల గురించి, పరిపాలన గురించి చదివాడు; మానవ హక్కుల గురించీ, మంచి చెడుల గురించీ చదివాడు. 'మంచికోసం నిలబడటం అవసరం' అనుకున్నాడు; అందరినీ కలుపుకు పోతే తప్ప ప్రయోజనం లేదనుకున్నాడు. తనకు లాగానే అవమానాల పాలు అవుతూ, గుడ్లనీరు క్రుక్కుకొని బ్రతుకుతున్నవాళ్లని అందరినీ ప్రేరేపించాడు. దేశంకాని దేశంలో అనామకులుగా జీవిస్తున్నవాళ్లంతా హక్కులకోసం పోరాటం చేశారు. చివరికి ప్రభుత్వం దిగి వచ్చింది. వాళ్లకీ హక్కులిచ్చింది.



వెనక్కి వచ్చిన మోహన్ సూటు బూటు వదిలేశాడు. టోపీలు, టైలు అంటే ఇప్పుడు అతనికి అసహ్యం వేసింది. ఇవన్నీ మన బానిసత్వానికి ప్రతీకల్లాగా కనిపించాయి. ఒకప్పుడు విదేశీయుల అలవాట్లను అనుకరించిన ఆ మోహన్‌దాస్ ఇప్పుడు బాపూజీగా ఎదిగాడు. మన స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తిగా వెలిగాడు. చివరికి "వీళ్ల దేశం నుండి వెళ్ళిపోతేనే నయంలే" అని బ్రిటిష్‌వాళ్ళు అనుకునేట్లు చేశాడు.

'బానిసత్వంలో ఉన్నాం' అని గుర్తించటంలోనే స్వాతంత్ర్యపు బీజాలు ఉన్నై, నిజంగా. ఏమంటారు?

అందరికీ స్వాత్రంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.

-కొత్తపల్లి బృందం.




# నీతి చంద్రిక -22

*జరిగిన కథ: మిత్రునితో కలిసి సంపాదించిన డబ్బునంతా త్రవ్వుకొని తీసుకుపోవటమే కాక, సొమ్మునంతా సుదర్శనుడే ఎత్తుకు పోయాడని ఫిర్యాదు చేస్తాడు నందిగుప్తుడు . చెట్టు చేతే సాక్ష్యం చెప్పిస్తానని బీరాలు పలికేసరికి అందరూ ఆశ్చర్యపోతారు. నందిగుప్తుడి తండ్రి అతనికి హితబోధ చేస్తుంటాడు.. ఇక చదవండి, నీతిచంద్రిక-22 వ భాగం..*

## ఉపాయం-అపాయం

ఒక వేప చెట్టు మీద ఒక కొంగల జంట నివసిస్తూ ఉండేది. కొన్నాళ్ళకు ఆడకొంగ గర్భం దాల్చింది. కొంగలు రెండూ కష్టపడి పుల్లలు, గడ్డి ఏరుకొచ్చి, చెట్టు మీదే ఒక చక్కని గూడు కట్టుకున్నాయి. ఆడకొంగ ఆ గూటిలో గుడ్లు పెట్టి పొదిగే సరికి, చిన్న చిన్న కొంగలు బయటికి వచ్చాయి.

ఒక రోజున ఆడ కొంగ భర్తతో "వినండి- ఈ రోజున ఒక ఆడపక్షి చెప్పగా విన్నాను: కొన్నాళ్ళ క్రితం ఇదే చెట్టు మీద అనేక పక్షులు నివసిస్తూ ఉండేవట. అయితే ఈ చెట్టు క్రింది పుట్టలో

ఉన్న నాగుపాము అదే పనిగా వాటి పిల్లలన్నిటినీ తినేస్తుండేదట. దాని బాధ భరించలేక, చివరికి ఆ పక్షులన్నీ వలస వెళ్ళిపోయాయట! ఇది విన్నప్పటినుండీ నేను భయంతో గడగడలాడి పోతున్నాను; ఊపిరి సరిగా ఆడటం లేదు నాకు. తెలీక ఈ చెట్టును పట్టుకొని ఉన్నాం- రెక్కలు రాని రక్తపు ముద్దల్లాంటి నా ఈ బుజ్జి కూనలకు అపాయం రానున్నది- ఇక నేను ఎలా తట్టుకోగలను?" అని బొటబొటా కన్నీరు కారుస్తూ దాని గొంతును కౌగలించుకున్నది.



అప్పుడా మగకొంగ కొంచెంసేపు ఆలోచించి, భార్యను ఊరడిస్తూ "ఎందుకు, ఊరికే విచారిస్తావు? విచారించి ఏమి సాధిస్తాం, మనం? శత్రువును చంపేందుకు ఉపాయం ఒకటి తట్టింది నాకు. విను- అక్కడ దూరంగా ముంగిస నివసించే పొద ఒకటి ఉన్నది. అక్కడినుండి- మనంనివసించే ఈ చెట్టు వరకూ- అక్కడక్కడా ఒక్కొక్క చేపను వేసి ఉంచుతాను నేను. ఆ ముంగిస ద్వారా మన కోరిక తప్పక నెరవేరుతుంది. నువ్వు బాధ పడకు" అని, ఇక ఆలోచించకుండా వెంటనే పోయి తన పథకాన్ని అమలు చేసేసింది.

చేపల వాసన పట్టిన ముంగిస పొదనుండి బయటికి వచ్చింది. చేపల్ని తింటూ పుట్ట దగ్గరికి వచ్చి, అక్కడ దాగి ఉన్న పామును చంపేసింది. అటుపైన అది చెట్టు పైకి ఎక్కి, అక్కడ గూడులో ఉన్న కొంగ పిల్లల్ని కూడాతినేసి, తన దారిన తను పోయింది.

అందువల్ల, ఒకటి చెయ్యబోతే మరొకటి అవ్వచ్చు. అప్పుడు వ్యవహారమంతా బురదలో పాతిన చెక్క స్తంభం మాదిరి, ఎటు ప్రక్కకు ఒరుగుతుందో కూడా తెలీకుండా అవుతుంది. నువ్వు చెబుతున్న ఈ పనేదో మంచిది కాదని అనిపిస్తున్నది నాకు" అన్నాడు నందిగుప్తుడి తండ్రి.

అప్పుడు నందిగుప్తుడు "మనిషన్నవాడు మొదట తనకు తోచిన ఉపాయాన్ని బట్టి పోతూ ఉండాలి గాని, అపాయానికి ఉపాయం, ఉపాయానికి అపాయం- ఇట్లా ఆలోచించుకుంటూ పోతే ఇక పని జరిగేదెన్నడు? సందేహించకు. కాదనకు. నా మాట విను. మనకంతా మేలే జరుగుతుంది" అని బలవంతపెట్టి ఎలాగో ఒకలా తండ్రిని ఒప్పించాడు. అర్థరాత్రి పూట చిమ్మ చీకటిలో ఆ తండ్రిని తీసుకెళ్ళి మర్రి-చెట్టుకున్న తొర్రలో కూర్చోబెట్టాడు గుట్టుగా. ఆ పైన ఇంటికొచ్చి, మిగిలిన రాత్రి సమయాన్ని ఒక్కడే వెళ్ళబుచ్చి, తెల్లవారగానే న్యాయస్థానానికి పోయాడు. ఆలోగా సుదర్శనగుప్తుడు కూడా అక్కడికి చేరుకున్నాడు. అందరూ కలిసి మర్రి చెట్టు దగ్గరికి బయలు దేరారు. ఈ వింతను చూసేందుకని ఎక్కడెక్కడినుండో చేరుకున్న జనాలందరూ ఎవరికి తోచినట్లు వాళ్లు ముచ్చటించుకుంటుంటే, ఆ శబ్దంతో ఆకాశం అంతా నిండిపోయింది.

అప్పుడు న్యాయాధికారులు ఆ చెట్టు ముందు నిలబడి, పెద్ద గొంతుతో "ఓ వృక్షరాజమా! ఈ వాది-ప్రతివాది ఇద్దరూ ఇక్కడ డబ్బును దాచిపెట్టారు కదా, ఆ తర్వాత ఏమి చేశారు? దానికి నువ్వే సాక్షివి; కనుక నీకు తెలిసినది మొత్తం, నిజమే పలుకు!" అన్నారు.

మరుక్షణం చెట్టునుండి ధ్వని వెలువడింది: "ఇక్కడ పాతిపెట్టిన డబ్బునంతా ఒక రోజు అర్థరాత్రిపూట ఒంటరిగా వచ్చిన సుదర్శనగుప్తుడు తీసుకెళ్ళాడు" అని. ఆ చిత్రానికి అక్కడి జనాలంతా నిశ్చేష్టులై బొమ్మల్లాగా నిలబడిపోయారు. న్యాయాధి-కారులు కూడా నివ్వెరపోయారు.

ముందుగా తేరుకున్న సుదర్శనగుప్తుడు మనసులో కొంచెం ఆలోచించుకొని, "ధర్మాధి-కారులారా! ఇదంతా నిజమని భావించకండి. లేకుంటే చెట్టేమిటి, సాక్ష్యం చెప్పటమేమిటి? 'చెట్టును తంతే పన్ను ఊడింది' అన్నట్లున్నది ఇది. మీరు నాకు అనుమతి ఇచ్చారంటే ఈ చెట్టు ఎంత గొప్ప సాక్ష్యం ఇస్తున్నదీ నేను ఇప్పుడే తేటతెల్లం కావిస్తాను" అన్నాడు.

వాళ్ళు అందుకు అంగీకరించగానే అతను ఆ చెట్టునెక్కి, దాని కొమ్మల మధ్య దూరాన్ని, వాటి దిశలను అన్నింటినీ జాగ్రత్తగా గమనించాడు. వాటిలోఒక కొమ్మ గుబురులో పెద్ద చీకటి గుహ లాంటి తొర్ర కనిపించింది అతనికి. అయితే అందులో దూరేందుకు భయపడి, అతను ఒక మోపెడు ఎండుగడ్డిని తెప్పించి, ఆ తొర్రలోకి జొనిపి, మంట పెట్టాడు.



ఎండుగడ్డి అంటుకొని మంటలు వ్యాపించే సరికి, తొర్రలో కూర్చొని ఉన్న ముసలాయనకు ఊపిరి ఆడలేదు. వేడికి శరీరం అంతా కాలిపోయింది. ఆ బాధను తట్టుకోలేక అతను హాహా కారాలు చేస్తూ బయటికి వచ్చి పడ్డాడు.

న్యాయాధికారులు అతన్ని "ఎవరు నువ్వు? ఇందులో ఎందుకు దాక్కున్నావు?" అని గద్దించి అడిగే సరికి అతను నిజం చెప్పేశాడు- "నేను నందిగుప్తుడి తండ్రిని. వాడు నేను ఎంత చెప్పినా వినలేదు. నా మాటల్ని పెడచెవిన పెట్టి, నాకు ఇలాంటి ఆపద తెచ్చి పెట్టాడు. నా శరీరం అంతా కాలిపోయింది, ప్రాణాలు నిలిచేటట్లు లేవు" అని విలవిల లాడుతూ చనిపోయాడు.

న్యాయాధి-కారులు నందిగుప్తుడిని కఠినంగా శిక్షించి, అతను దొంగిలించిన ధనాన్నంతా సుదర్శన గుప్తుడికి ఇప్పించారు. అలా దురాశకు లోనై మిత్ర ద్రోహానికి ఒడిగట్టిన నంది గుప్తుడు ఆ డబ్బుతోబాటు తండ్రినీ కోల్పోవలసి వచ్చింది.

కరటకుడు దమనకుడితో ఈ కథ చెప్పి "తొందరపాటులో దూరం ఆలోచించక, నువ్వు చెప్పిన మాటలు విన్నాను. 'ఇది చెడ్డపని' అని ముందు తోచనే లేదు, నాకు. సంజీవకుడు ఏనాడూ మనకు ఒక్క కీడు

కూడా తలపెట్టలేదే! ఏ పాపమూ ఎరుగనివాడు- పాపం అతని ప్రాణాలకే ఎసరు పెట్టావు నువ్వు. పాపిష్టివాడిని, నేనూ నీ కుతంత్రంలో భాగం పంచుకున్నాను. ఇది మనకు మంచిది కాదు. ఇతరులను మోసగించాలనుకున్నవాడు తానే మోస- పోతాడు. దీనికి నిదర్శనంగా నీకొక కథ చెబుతాను విను-



'అజస్తుదం' అనే పట్టణంలో ఇంద్రపాలితుడు అనే వ్యాపారి ఒకడు ఉండేవాడు. అతనికి ధనగుప్తుడు అనే స్నేహితుడు ఒకడు ఉండేవాడు. ఒకరోజు ఇంద్రపాలితుడు అరవై బారువుల ఇనుమును కూలివాళ్ల చేత మోయించుకొని మిత్రుడి దగ్గరికి వెళ్ళాడు.

వెళ్ళి, "అన్నా! ఉన్నట్లుండి వేరే దేశం పోవలసి వస్తున్నది. మానే వీలు లేదు. రేపే నా ప్రయాణం. ఈ ఇనుమును నీ దగ్గర ఉంచుకో. పోయిన సంవత్సరం ఈ సరుకును నువ్వూ, నేనూ కలిసే కొన్నాం- ధర నీకు తెలుసుగా? రూపాయికి అర్థ అణా లాభం వచ్చినా చాలు- మొదటినుండి ఇప్పటివరకూ అయిన వడ్డీని కలుపుకొని,నేను చెబుతున్నంత లాభం వస్తే చాలు- అమ్మెయ్యి. ఇతరుల నుండి నువ్వు వాడుకగా ఎంత తరుగు తీసుకుంటావో అంత తరుగు తీసుకో. నేను చెప్పినంత ధర రాకపోతే సరుకును కదల్చకు. ఇనుము చెడిపోయే వస్తువు ఎలాగూ కాదు- ఇవాళ్ల కాకపోతే రేపు- మంచిధరకే అమ్ముకోవచ్చు. రేపే నా ప్రయాణం, కనుక చాలా పని ఉన్నది. క్షణం

తీరిక లేదు. సరుకు ఇదిగో, అప్పగించుకో వెంటనే!" అన్నాడు.

ధనగుప్తుడు అది విని "అయ్యో, మిత్రమా! నేనేమైనా పరాయివాడినా? నాకు ఇంత చెప్పాలా? నువ్వు నాకిచ్చే తరుగు కోసం ఆశపడేవాడినా, నేను? గురువు సాక్షిగా చెబుతున్నాను విను- నీ సొమ్మును నా సొమ్ముగా చూస్తాను తప్ప, వేరుగా చూడను. నన్ను నమ్ము" అని చెప్పి ఇనుమును ఇప్పించుకున్నాడు.

మరునాడు ఉదయాన్నే ఇంద్రపాలితుడు విదేశాలకు బయలుదేరాడు. అక్కడ తన పనులన్నీ పూర్తి చేసుకొని, కొంతకాలానికి తిరిగి వచ్చి, తీరికగా మిత్రుని ఇంటికి పోయాడు. అతన్ని చూడగానే ధనగుప్తుడు లేచి ఎదురు వచ్చి ఆహ్వానించి కుశల ప్రశ్నలు వేశాడు; ప్రయాణం గురించి, తను చూసిన వింతలు విశేషాల గురించి అడిగాడు. ఇంద్ర పాలితుడు వాటన్నిటికీ సమాధానాలు ఇస్తూ కొంతసేపు గడిపి, మిత్రుడి వ్యాపారం ఎలా జరుగుతున్నదో అడిగి, అటుపైన అసలు విషయానికి వచ్చాడు- "ఈమధ్య ఇనుము రేటు బాగా పెరిగిందని విన్నాను. మన ఇనుము ఎట్లా ఉన్నది?" అని అడిగాడు. ఇనుము సంగతి వినగానే ధనగుప్తుడి ముఖం చిన్నబోయింది.



"అప్పుడు మనం కలిసి కొన్న ఇనుము నా దగ్గరకూడా మరికొంత నిలవ ఉంటే, దాన్ని కూడా నీ ఇనుముతో కలిపి గదిలో పెట్టి, తలుపు మూసి, తాళం వేసి జాగ్రత్త చేశాను.

నిన్ననే కొందరు వర్తకులు వచ్చి, 'ఇనుము కావాలి' అని అడిగారు. 'సరే, చూద్దాం' అని గది తలుపు తీసి చూద్దును గదా, లోపల ఇనుమన్నదే లేదు!

'నా సొమ్ము పోయిందే' అని నాకు రవ్వంత కూడా బాధ కలుగలేదు- మిత్రుడు నన్ను నమ్మి నా దగ్గర దాచుకున్న సొమ్మును, అతను రాగానే "ఇదిగో నాయనా నీ సొమ్ము" అని ఇచ్చెయ్యకుండా, 'పోయింది' అని చెప్పవలసి వస్తున్నదే, అని నా మనసు కృంగిపోయింది. నా మీది విశ్వాసంతో నువ్వు నష్టాన్ని ఖాతరు చెయ్యకపోవచ్చు; కానీ లోకులు ఊరుకోరు కదా, మర్యాద దక్కదు గదా!" అని విచారపు బరువుతో కృంగిపోతున్నవాడిలాగా కొంచెం సేపు ఊరుకున్నాడు.

అటుపైన నిట్టూరుస్తూ "గది తలుపులు మూసి, పెట్టిన తాళం పెట్టినట్లు ఉండగానే లోపలి సరుకంతా ఎలా మాయం అవుతుంది' అని జాగ్రత్తగా ఆలోచించి చూశాను. మా ఇంట్లో ఎలుకల బాధ ఎక్కువ. ఏ సరుకును గానీ అవి బ్రతకనివ్వవు. అవే మన ఇనుమును కూడా తినేసి ఉంటాయని అనుకున్నాను, చివరికి!" అన్నాడు.

అది విని ఇంద్రపాలితుడు వాడి మోసాన్ని తెలుసుకొని, "ఓహో! వీడు నా సొమ్మును కాజేసేందుకే ఇక్కడ ఇన్ని పన్నాగాలు పన్నాడు. వేరే ఏదైనా మోసం చేసి వీడినుండి సొమ్మును రాబట్టుకోవాలి గాని, మంచితనంతో కాదు " అనుకున్నాడు.

తన ఆలోచనల్ని మొహం మీదికి రానివ్వకుండా "అన్నా! దీనికి ఇంత చెప్పాలా? నేను ఏమైనా క్రొత్తవాడినా? నీ స్వభావం ఎలాంటిదో నాకు తెలీనిదా? దైవంవల్ల వచ్చిన కష్టానికి మనం ఏంచేస్తాం? దీనికోసం నువ్వేమీ చింతించకు, పోయి వస్తాను" అని సెలవు పుచ్చుకొని తన ఇంటికి పోయాడు. ఆ తర్వాతకూడా లేని స్నేహభావనను తెచ్చిపెట్టుకొని, ఎప్పటిలాగానే మిత్రుడి ఇంటికి రాకపోకలు కొనసాగించాడు.

(వచ్చేసారి మిత్రభేదం ముగింపు ..)



# ఎగిరిననక్క

*నక్కలకు పిట్టలంటే అంతకోపం ఎందుకో మాకు ఈ కథ చదివాక తెలిసింది. చదవండి, మీకూ తెలుస్తుంది..*

*రచన: ఆర్.ప్రగతి,8 వతరగతి,Z.P.హైస్కూల్, వెంకటంపల్లి, అనంతపురం జిల్లా.*



అనగనగా ఒక అడవిలో ఒక నక్క. ఆ నక్కకు వున్నట్టుండి 'తాను కూడా పక్షిలాగా ఎగిరితే ఎంత బాగుండును' అని కోరిక పుట్టింది. ఆ కోరిక అంతకంతకూ బలపడిపోయింది. 'ఎలాగైనా సరే ఎగిరెయ్యాలి' అనుకున్నది.

సరిగ్గా అప్పుడే చెట్టు మీద ఒక పిట్ట కనిపించింది. నక్క దాని దగ్గరికి వెళ్లి "పిట్ట పాపా, పిట్ట పాపా! ఎగరటంలో వున్న రహస్యం ఏమిటో చెప్పవా, ప్లీజ్?" అంటూ బ్రతిమిలాడింది.

"ఓస్! దానిదేముంది? నిజానికి ఎగరటం అనేది చాలా సులభం. నువ్వేం చేయాలంటే, ముందు ఒక ఎత్తైన చెట్టును చూసుకోవాలి. దాని పైకి ఎక్కి, ఒక్కసారిగా క్రిందికి

దూకెయ్యాలి. ఒకవేళ నువ్వు క్రిందకి పడిపోతున్నావనుకో, అప్పుడు "పైకి..పైకి!"అని అరవాలి. మరీ పైకి కూడా ఎగరకూడదు. సూర్యుడి వేడి తగిలితే కష్టం. నువ్వు ఎగరటం మొదలు పెడితే మిగిలిన సంగతులన్నీ నీకే అర్థమవుతాయి" నిజాయితీగా చెప్పింది ఆ పిట్ట.

"నిజంగా అంతేనా?" అనుమానంగా అడిగింది నక్క"

"ఏమో, మా అమ్మైతే నాకు అంతే చెప్పింది. నేను అట్లాగే మొదలుపెట్టాను- ఎగరటం" చెప్పేసి తుర్రున ఎగిరిపోయింది పిట్ట.

నక్క వెతికి వెతికి ఒక పెద్ద చెట్టును ఎంచుకున్నది. ఆ చెట్టు చిటారు కొమ్మదాకా ఎక్కి, "ఇప్పుడు నేను ఎట్లా ఎగురుతానో చూడండి" అంటూ క్రిందకు వంగి అక్కడ గుమిగూడిన తన బంధుమిత్రులందరికీ అరిచి చెప్పింది.

వాళ్ళంతా "వద్దు..వద్దు!" అని అరిచారు- కానీ నక్క వాళ్ల మాటలు పట్టించుకోలేదు; ఒక్క దూకు దూకింది గాలిలోకి. 'పైకి..పైకి.. అనుకోవాలి" అని అనుకుంటూనే ఉన్నది పాపం. అయితే ఇంకా ఆ మాట మనసులో ఉండగానే నేల వచ్చి తగిలింది బలంగా. ఆ దెబ్బకి దాని కాలు కాస్తా విరిగిపోయింది!

నక్కకి బుద్ధి వచ్చింది. మళ్లీ ఇంకెప్పుడూ పక్షిలాగా ఎగిరే ప్రయత్నం చెయ్యలేదు.

అప్పటినుండీ నక్కలకు పిట్టలంటే చాలా కోపం.

### ఏదో ఛానల్!

జోకు

టీచర్: శ్రీకాంత్ 'ఇంగ్లీష్ ఛానల్' ఎక్కడుంది?

శ్రీకాంత్: ఏమో! టీచర్! మాటివీలో ఆ ఛానల్ రాదు.

*సేకరణ: సోమిరెడ్డి, నల్గొండ*



# దురాశ

*జానపద కథలు తెలిసినవే అయినా కథనంతో కొత్తదనం వస్తుంది. పిల్లల్లో ఎంతో కాలంగా నడుస్తూనే ఉన్న ఈ కథ రూపాల్లో ఒకదాన్ని గతంలో కూడా కొత్తపల్లి ప్రచురించింది..*

*సేకరణ: వనమ అరుణకుమారి,8 వతరగతి, అరవింద హైస్కూల్, కుంచనపల్లి, కృష్ణాజిల్లా.*

రంగయ్యకు ఇద్దరు కొడుకులు. పెద్ద వాడు రాజుకి పెళ్ళి చేసాడు. రెండవ వాడు బుజ్జికి ఇంకా పెళ్ళి కాలేదు. చనిపోయేముందు రంగయ్య తన ఆస్తినంతా రెండు భాగాలు చేశాడు. పెద్దవాడికి కొంచెం ఎక్కువ, చిన్నవాడికి కొంచెం తక్కువ ఇచ్చాడు.

రాజు భార్య రాణి గడుసుది. అటు రంగయ్య చనిపోగానే ఇటు భర్తను పిలిచింది- "మీ

తమ్ముడికి ఆస్తి పంచాము కదా! ఇంక వేరేగా ఉండమనండి" అంది. భార్య మాటని కాదనలేదు రాజు. రాణి చెప్పినట్లే చేసాడు. అన్నదమ్ములిద్దరూ వేరుపడ్డారు.

అప్పుడు మన బుజ్జిగాడు తన వాటాకు వచ్చిన ఒక్క గేదెనూ తోలుకొని చెరువుకి వెళ్ళాడు. అంతలోనే ఏమైందో ఏమో, బుజ్జిగాడి గేదె చెరువులోకి వెళ్ళి అందులోనే మునిగి చనిపోయింది. వాడు పాపం, ఏం చేస్తాడు? ఆ గేదె చర్మాన్ని ఒలిచి అడవికి తీసుకెళ్లాడు. బాగా ఆరేందుకని దాన్ని అడవిలో ఒక పెద్ద చెట్టు కొమ్మల మీద పరచి కట్టాడు.

కొన్ని రోజులు గడిచాయి. చెట్టుమీద గేదె చర్మం బాగా ఎండింది. అంతలో కొంత మంది దొంగలు ఎక్కడెక్కడో బాగా డబ్బు దోచుకొని, వాటాలు పంచుకునేందుకు అడవిలోకి వచ్చారు. ఆ చెట్టు క్రిందే, దుప్పటి మీద డబ్బులు, నగలు పరిచారు. వాటిని వేరువేరు భాగాలు చేస్తున్నారు. అంతలోనే వర్షం మొదలైంది. ఎండిన చర్మం మీద వాన పడే సరికి అది 'ధంధం..ధంధం' అని శబ్దం చెయ్యడం మొదలుపెట్టింది. దొంగలు బెదిరిపోయారు. 'ఎవరో తమని చూసి, మిగతా వాళ్లందరినీ పిలుస్తున్నారు' అని భయపడ్డారు. తాము సంపాదించిందంతా అక్కడే వదిలేసి ఉడాయించారు.

మరుసటి రోజున బుజ్జిగాడు అడవికి వెళ్ళాడు. అక్కడ చెట్టుక్రింద కుప్పలు పోసి ఉన్న డబ్బును, నగల్ని చూసి ఆశ్చర్యపోయాడు. మొత్తం ఇంటికి తీసుకొచ్చుకున్నాడు.

ఆరోజు అతను వదిన దగ్గరికి వెళ్ళి "వదినా, బియ్యం కావాలి" అనగానే వదిన డబ్బులడిగింది. బుజ్జిగాడు ఒక వెయ్యి రూపాయల నోటు తీసి ఇచ్చాడు. అది చూసి వదిన సొమ్మ సిల్లి పడిపోయింది. అంతలో రాజు వచ్చి, ఆమెని లేపి, జరిగిన సంగతి తెలుసుకొని బుజ్జి దగ్గరకు వెళ్ళి- "నీ దగ్గరికి ఏదో చాలా డబ్బు వచ్చినట్లుంది..ఎలా వచ్చింది, నిజంచెప్పు!" అన్నాడు.

"నాగేదెను చెరువుకి తీసుకు వెళ్ళాను అంతే.

అది కాస్తా చనిపోయింది. ఏం చెయ్యాలో తెలీక, దాని చర్మాన్ని అమ్మాను. నాకు ఇన్ని డబ్బులు వచ్చాయి!" అన్నాడు తమ్ముడు గడుసుగా.

అన్న ఆలోచనలు పరుగులు తీసాయి. "వీడికి ఒక గేదే కదా, ఉన్నది? నాకైతే రెండు గేదెలు ఉన్నాయి! వాటి చర్మాన్ని అమ్మితే నాకు ఇంకా చాలా డబ్బులు వస్తాయి!" అనుకున్నాడు. తన రెండు గేదెల్నీ చెరువుకి తోలుకెళ్ళాడు. అవి చావకపోయినా, తనే బలవంతంగా రెండిటినీ చంపేశాడు. అటుపైన వాటి చర్మాన్ని తీసుకువెళ్ళి మార్కెట్టులో పెట్టి అమ్మటం మొదలు పెట్టాడు. అవి అస్సలు అమ్ముడు పోలేదు. అంతే కాదు; రెండో రోజుకల్లా అవి ఎంత కంపు కొట్టాయంటే, సంతలోని వ్యాపారులంతా రాజును కొట్టి కొట్టి తరిమారు.

వెనక్కి వచ్చాక, రాజుకి తమ్ముడంటే విపరీతమైన కోపం వచ్చింది. ఎవ్వరూ లేని వేళ తమ్ముడి ఇల్లు కాస్తా తగలపెట్టాడు. బుజ్జిగాడు వచ్చి చూసుకుంటే ఏముంది, ఇల్లంతా బూడిదైంది! వాడు భోరు భోరున ఏడుస్తూ ఆ బూడిదనే ఒక బస్తాలో వేసుకొని పోయాడు. బూడిదమూట చాలా బరువుగా ఉంది. అయినా వాడికి అది బరువు అనిపించలేదు. ఆరోజు సాయంత్రానికి వాడొక సత్రం చేరుకొని, అక్కడ బస చేశాడు. మాటి మాటికీ ఆ బస్తాను విప్పి చూసుకుం-టున్నాడు. అందులోనే కన్నీళ్ళు కారుస్తున్నాడు.

అదే సత్రంలో ఆగాడు ఒక మోసగాడు. తను ఎవరెవరినో మోసంచేసి సంపాదించుకున్న బంగారు నాణాలను ఒక చిన్న మూటగా కట్టి, వెంట పెట్టుకొని తిరుగుతుంటాడు వాడు. బుజ్జిగాడు బస్తాలోకి కన్నీళ్ళు కార్చటం చూసి వాడు ఆశ్చర్యపోయాడు. బుజ్జిగాడు నిద్రపోగానే మెల్లగా ఆ బస్తాను విప్పి చూశాడు. బస్తానిండా బూడిద ఉన్నది. అయితే అక్కడక్కడా ఆ బూడిదలో మెరిసే రాళ్ళు కనబడ్డాయి. "ఓహో! ఇందులో కన్నీళ్ళు కారిస్తే వజ్రాలు తయారౌతాయన్నమాట!" అనుకున్నాడు వాడు. తన చిన్న మూటను

అక్కడే వదిలేసి, రాత్రికి రాత్రే బుజ్జిగాడి బూడిద బస్తాను ఎత్తుకుపోయాడు!

తెల్లవారగానే బుజ్జిగాడికి బస్తా స్థానంలో బంగారు నాణాల మూట కనబడింది. వాడు దాన్ని తీసుకొని కులాసాగా ఇల్లు చేరుకున్నాడు. తనకు దొరికిన ఆ డబ్బుని కొలుద్దామనుకున్నాడు బుజ్జిగాడు. వదిన దగ్గరకు వెళ్ళి మానిక అడిగాడు.

అయితే వదినకు అనుమానం వచ్చి, మానికకు అడుగున కొంచెం చింతపండు అతికించి ఇచ్చింది వాడికి- "జాగ్రత్త నాయనా! ఇప్పటికే మానికకు చిల్లి పడింది" అన్నది. బుజ్జిగాడు ఆ మానికను తీసుకెళ్ళి తన దగ్గర బంగారు నాణాలు ఎన్ని ఉన్నాయో కొలుచుకున్నాడు. పని అయిపోగానే మానికను జాగ్రత్తగా వదినకు తిరిగి ఇచ్చి వచ్చాడు కూడా. అయితే వాడికి తెలీకుండా, మానికకు అడుగున చింతపండులో ఒక బంగారు నాణెం అతుక్కొని ఉండిపోయింది!

వాడు మానికను ఇచ్చి వెళ్ళగానే వదిన దాన్ని పరీక్షించింది. మానిక అడుగున అతుక్కుని బంగారు నాణెం బయటపడింది. "అంటే వీడు ఈమానికతో బంగారునాణాలు కొలిచాడన్నమాట!" ఆ ఆలోచనకే ఆమెకు ఊపిరి సలపలేదు. వెంటనే రాజుని పిలిచి, వాళ్ళ తమ్ముడికి అంత డబ్బు ఎక్కడినుండి వచ్చిందో అడగమన్నది.

అన్న పరుగున వెళ్ళి తమ్ముడిని అడిగాడు. "నా ఇల్లు కాలి బూడిద అయ్యింది. నేను దాన్ని తీసుకెళ్ళి అమ్మాను. ఎవరో దాన్ని తీసుకొని నాకు ఇన్ని డబ్బులు ఇచ్చారు' అన్నాడు తెలివైన తమ్ముడు.

"ఓహో! వాడికి ఉన్నది ఒక్క ఇల్లే గదా, నాకైతే రెండు ఇల్లులు వున్నాయి. ఎక్కువ బూడిదకు మరిన్ని డబ్బులు వస్తాయిలే!" అనుకున్నాడు ఆశపోతు రాజు. భార్యా-భర్తలిద్దరూ కలిసి రెండు ఇళ్ళనూ తగల బెట్టి బూడిదను సంతకు తీసుకువెళ్ళారు. 'సోల అయిదు రూపాయలకు అమ్మినా బోలెడు డబ్బు!" అని వాళ్ళు అనుకున్నారు; కానీ ఇంతలో గాలి ఎంతలా వీచిందంటే, ఆ బూడిదంతా ఎగిరి అక్కడ వున్న జనాల

కళ్ళలో పడింది! సంతలోని వాళ్ళంతా ఈ బూడిద బస్తాలను విసిరేసి, వీళ్లను ఇష్టం వచ్చినట్లు కొట్టారు.

అన్న కోపంతో ఉడికిపోతూ ఇంటికి వచ్చేసరికి, బుజ్జిగాడు మంచం మీద ఒళ్ళు మరచిపోయి నిద్రపోతూ కనబడ్డాడు. అన్నకు కోపం ఆగలేదు-"వాడిని తాళ్ళతో కట్టి కాలవలో పారేయండి" అని తన మనుషులకు పురమాయించాడు. వాళ్ళు వాడిని మంచంతో సహా మోసుకుని వెళుతూ ఉండగా వాడికి మెలకువ వచ్చింది. తనను మోసుకెళ్తున్న వాళ్ళని గుర్తుపట్టాడు. వాళ్ళను ఓసారి ఆగమని చెప్పి, "నన్ను ఎందుకు తీసుకువెళ్తున్నారు?" అని అడిగాడు. "మీ అన్న కాలవలో పడెయ్యమన్నాడు నిన్ను" అన్నారు వాళ్ళు.

బుజ్జిగాడు అప్పుడు సమయస్ఫూర్తితో "ఉండండి. ఇంకాసేపట్లో నేను ఎలాగూ చనిపోతాను. ఆలోగా నన్ను కొంచెం పుణ్యం సంపాదించుకోనివ్వండి" అన్నాడు వాళ్ళతో. "సరే చెప్పు! ఏంచేస్తావు?" అన్నారు వాళ్లు. "ఇదిగో చూడండి, నాజేబులో డబ్బులు వున్నాయి. వాటిని తీసుకొని మీరు బిర్యాని తిని రండి" అన్నాడు బుజ్జిగాడు. "ఓహో! బలే ప్లాన్ వేశావు, మమ్మల్ని అటు పోనిచ్చి నువ్వు ఇటు పారిపోవడానికా?" అన్నారు వాళ్ళు. "కాదు కాదు! మీరు నన్ను చాలా దూరం నుంచి మోసుకు వస్తున్నారు కదా, మీకు ఆకలి వేస్తుంటుంది పాపం. చనిపోయేముందు ఆకలిగా ఉన్న వాళ్లకు అన్నం పెడితే నాకు ఎంత పుణ్యం!" అని వాళ్ళను సాగనంపాడు బుజ్జి. వాళ్ళు వాడిని మంచంతో సహా ఒక చెట్టుక్రింద దింపి, బిర్యానీ తినేందుకు వెళ్ళారు.

అంతలోనే ఒక ముసలివాడు గొర్రెలను తోలుకొని అటువైపుగా వచ్చాడు. ఆ మంచాన్ని, దానిమీద పడుకొని ఉన్న బుజ్జిగాడిని చూసి "ఏంటీ! నిన్ను ఇట్లా ఎవరు కట్టేసారు?" అని అడిగాడు.

"నాకు పెళ్ళి వద్దు మొర్రో అన్నా కూడా వినకుండా పెళ్ళి చేసేందుకు తీసుకువెళ్తున్నారు, మా అన్నలు!" అని నమ్మ


బలికాడు బుజ్జిగాడు. ఆ ముసలివాడికి పెళ్ళి పిచ్చి. "నీ బదులు మరి నేను పెళ్ళి చేసుకుంటాను. నీ స్థానంలో నన్ను కడతావా?" అన్నాడు వాడు ఆశగా.



"ఓఁదానిదేమి భాగ్యం? ముందు ఈ తాళ్ళు విప్పు" అన్నాడు బుజ్జి. పెళ్ళి తొందరలో ఉన్న ముసలివాడు వాడిని విప్పేసి , వాడి స్థానంలో తను పడుకొని, మళ్ళీ తాళ్ళతో కట్టేయించుకున్నాడు. బుజ్జిగాడు ఆ గొర్రెలను తోలుకొని గబగబా ఇంటి దారి పట్టాడు. కొంత సేపటికి పనివాళ్ళు బిర్యానీ తిని వచ్చి, బుజ్జిగాడి స్థానంలో పడుకొని ఉన్న ముసలివాడిని చూసి "ఇదేంటి, నువ్వెట్లా వచ్చావు, ఇక్కడికి?" అని అడిగారు. "నాకు పెళ్ళి చెయ్యండి!"అని ముసలివాడు అనేసరికి వాళ్లంతా కడుపుబ్బ నవ్వుకొని, వాడిని విప్పి తరిమేసారు.

ఆలోగా అన్న ఎదురయ్యాడు బుజ్జికి. బుజ్జి అన్నన్ని గొర్రెలు తోలుకురావటం చూసి "ఏంటిరా తమ్ముడూ! నిన్ను కాలవలో విసిరేశారు కదా, మరి నీకేంటి, ఈ గొర్రెలు?" అని అడిగాడు. "వాళ్ళు నన్ను నీళ్ళలో పడవేయగానే జలదేవత వచ్చింది. నా ఒక్కో మునుకకు ఒక్కో గొర్రెను ఇచ్చింది" అన్నాడు తమ్ముడు తెలివిగా.

ఆశపోతు అన్న-వదినలు ఇంక ఆలోచించలేదు. 'వాడు ఒక్కడే గదా, మేము ఇద్దరం!' అనుకున్నారు. ఇద్దరూ వెళ్ళి కాలవలో మునిగారు. అట్లా మునిగిన వాళ్లు ఇంక మళ్ళీ వెనక్కి రాలేదు! ✿



# రాణి కడుపులో చేప

*జానపద కథలు మన గ్రామీణ సమాజానికి దర్పణాలు. వాటిని ఊరికే చదివితే చాలదు- లోతుగా చూడాలి. అనంతపురం జిల్లాలో వినబడే అసంబద్ధమైన ఈ చేపన్న కథ, నిజానికి మన సమాజంలోని అసమానతల, అన్యాయాల చిత్రణ..*

*కథనం: బి.శ్రీలక్ష్మి, ఐదవ తరగతి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గడ్డంనాగేపల్లి, అనంతపురం జిల్లా.*

అనగనగా ఒక ఊరిలో ఒక రాజు ఉండేవాడు. అతనికి ఒకభార్య. వాళ్ళకు ఎన్నిరోజులైనా పిల్లలు కలుగలేదు. అందుకు వాళ్ళు రోజూ ఏడుస్తూ ఉండేవాళ్ళు.

ఒక రోజున చాలా చేపలు వచ్చాయి అమ్మకానికి. అన్నీ చనిపోయి ఉన్నాయి; కానీ వాటిలో ఒక చేప మాత్రం బ్రతికే ఉంది. రాణి ఆ చేపను చూడగానే మళ్ళీ ఏడ్చింది- "దేవుడా! ఈ చేపనైనా నా కడుపులో వెయ్యరాదా?" అని.

చేపలు వెళ్ళిపోయిన మూడు నెలల తర్వాత రాణి గర్భవతి అయ్యింది. రాణి గర్భవతి

అయ్యిందని దండోరా వేశారు. అందరూ చాలా సంతోష పడ్డారు. చివరికి రాణికడుపులో చేప పుట్టింది! "దేవుడా! చేప వెయ్యమంటే చేపే వేస్తావా!" అని రాణి కుళ్లి , కుళ్లి ఏడ్చింది. ఆ చేపకు "చేపన్న" అని పేరు పెట్టుకొనింది.

అప్పటి నుండి ఆ చేప రోజు రోజుకూ లావైంది. ఒకరోజున రాణి రాజుతో "ఏమండీ! మన బాబు లావవుతున్నాడు. ఇప్పుడు మన బాబు కోసం ఒక బంగారు బావి కట్టించాలి. కట్టించాక మన బాబుని అందులో ఉంచి రావాలి" అన్నది. రాజు చేపకోసం బంగారు బావిని కట్టించి, చేపన్నను అందులో వదిలాడు.

ప్రతి రోజూ ఒక కూలివాడు చేపన్నకు అన్నం తీసుకువెళ్ళేవాడు. ఒకరోజున చేపన్న అన్నం తింటూ అడిగింది- "ఇవాళ్ల ఊళ్ళోంచి ఏదో శబ్దం వస్తున్నది- ఏంటి అది?" అని. అప్పుడు కూలివాడు "చేపన్నా! నీ అంత వయసు ఉన్న వాళ్లకు పెళ్లి జరుగుతున్నది ; నీకేంటి, ఇంకా పెళ్లికాలేదు?" అన్నాడు నవ్వుతూ.

వెంటనే చేపన్నకు కోపం వచ్చేసింది-"ఒరే, నాకు గాని రెండు రోజుల్లో పెళ్ళి చేయకపోతే నేను వచ్చి కనబడ్డవాళ్లనల్లా మింగేస్తా. మీ రాజు,రాణిలతో చెప్పు, ఈ సంగతి. ఫో, త్వరగా" అని బెదిరించింది వాడిని.

కూలివాడు ఈ సంగతి రాజు,రాణిలతో చెప్పే సరికి, వాళ్ళిద్దరికీ చాలా దిగులు పట్టుకున్నది. ఎలాగైనా చేపన్నకు తగిన భార్యను వెతకాలని గుర్రమెక్కి బయలుదేరాడు రాజు.



అట్లా ఆయన గుర్రం ఎక్కి, గోతం నిండా బంగారు నాణాలు వేసుకొని వెళ్తూ ఉంటే ఒకాయన ఎదురయ్యాడు. "ఎక్కడికి వెళ్తున్నారు, రాజుగారూ?" అని అడిగాడు. "చేపన్నకు తగిన భార్య కోసం

వెతుకుతున్నాను" అన్నాడు రాజు. అప్పుడు అతను అన్నాడు- "ఎక్కడికో ఎందుకు రాజుగారూ! నాకు ఇద్దరుకూతుర్లు ఉన్నారు. వాళ్లలో పెద్ద అమ్మాయిని ఇస్తాను" అని.



పెద్దలంతా కలిసి చేపన్నకు ఆ పాపను ఇచ్చి పెళ్లి చేశారు. అప్పటి నుండి ఆ పాపే, చేపన్నకు అన్నం తీసుకువెళ్ళేది. ఒక రోజున ఆమె అన్నం తీసుకువెళ్తుంటే దారిలో ఆలస్యం అయ్యింది. ఆమె చేరుకునేసరికి చేపన్నకు చాలా ఆకలైపోయింది. "ఏమిటే, ఇంతలేటు? నాకు చాలా ఆకలిగా ఉంది" అని అంటూనే ఒక్క సారిగా ఆమెను తినేసింది చేపన్న!

ఎంతసేపటికీ ఆమె ఇంటికి రాకపోవడంతో ఇంట్లోవాళ్ళు కంగారుపడ్డారు. అయితే ఎంత వెతికినా ఆమె కనబడలేదు. మరుసటి రోజు నుండీ కూలివాడిని అన్నం తీసుకుపొమ్మన్నారు మళ్ళీ. మరుసటి రోజున కూలివాడు అన్నం తీసుకుపోయాడు; కానీ చేపన్న తినలేదు- "నాకు ఇప్పుడు అన్నం వద్దు. ఇంకో పెళ్ళి కావాలి. చెయ్యకపోతే ఆ పాపను మింగినట్లే మిమ్మల్నందరినీ మింగుతా" అన్నది.

ఆ విషయం కూలివాడు రాజుతో చెప్పాడు. రాజు గుర్రం ఎక్కి గోతం నిండా బంగారు నాణాలు వేసుకొని పోతూఉంటే అంతకు ముందు కనబడిన వ్యక్తే మళ్లీ కనపడ్డాడు. "ఏమి జరిగింది రాజుగారూ?" అంటే అప్పుడు రాజుగారు జరిగిందంతా చెప్పాడు. ఆయన ఆ బంగారునంతా చూసి "నాకు

రెండో కూతురు ఉంది కదా! ఆ కూతుర్ని నీ కోడలిగా ఇస్తానులే" అన్నాడు. చేపన్నకు, ఆ పాపకు మళ్ళీ పెళ్లి అయ్యింది.

మరుసటి రోజు ఆ అమ్మాయి చేపన్నకోసం అన్నం తీసుకొని వెళ్తూ దారిలో రాయి మీద కూర్చొని ఏడవటం మొదలు పెట్టింది. ఆ సమయంలోనే ఆకాశంలో శివుడు, పార్వతి ఎక్కడికో పోతూ ఉన్నారు. "అక్కడ చూడు! కింద ఎవరో ఏడుస్తున్నారు" అని వాళ్లిద్దరూ కిందికి వచ్చారు. "ఎవరమ్మా నువ్వు?" అని అడిగాడు శివుడు. ఆ అమ్మాయి పలకలేదు. అప్పుడు శివుడు "నువ్వు భూతానివా, దయ్యానివా, పిలిస్తే పలకవెందుకు?" అని అడిగాడు. "లేదు! నేను మనిషిని!" అని పెద్దగా అరిచింది ఆ పాప. "మరి ఎందుకు అలా ఏడుస్తున్నావు, చెప్పు?" అన్నాడు శివుడు. ఆమె జరిగిందంతా చెప్పింది. "అలాగా! ఇదిగో పాపా! ఈ ఇసుక తీసుకొని ఆ చేపన్న మీద మూడు సార్లు చల్లు" అని శివుడు, పార్వతి ఆ పాపకు కొంత ఇసుక ఇచ్చి మాయమయ్యారు.

అప్పుడు ఆ అమ్మాయి రాయి మీద నుండి లేచి చేపన్న దగ్గరకు పోయింది. "ఏంటే ఇంత ఆలస్యంగా వచ్చావు. నాకు చాలా ఆకలిగా ఉంది " అని అరిచింది చేప. ఆ పాప మాట్లాడకుండా దానికి అన్నం పెడుతూ శివుడు ఇచ్చిన ఇసుకని దానిమీద మూడుసార్లు పోసింది. దాంతో ఆ చేపన్న కాస్తా మనిషిగా మారిపోయాడు! వాడి బుద్ధికూడా మారిపోయింది!

అప్పుడు అమ్మాయి చాలా సంతోషించింది. రాజు రాణి, అందరూ కూడా చాలా సంతోషపడ్డారు. ఆ తర్వాత అందరూ సుఖంగా జీవించారు.

టీచర్: రాము! దొంగతనం చేయటం తప్పని నీ అంతరాత్మ చెప్ప లేదా?!

రాము: చెప్పింది టీచర్, కానీ చెప్పుడు మాటలు వినరాదని మీరే అన్నారు కదా, అని....

*సేకరణ: ఆర్.ప్రగతి, ఎనిమిదోతరగతి, వెంకటంపల్లి.*



# మంగయ్య తెలివి



*సేకరణ, కథనం: ఎం.రచన, 8 వతరగతి, మహీంద్ర అకాడమి, జహీరాబాదు.*
*సౌజన్యం: జహీరాబాద్ పిల్లల కథలు, మనలైబ్రరీ, జహీరాబాదు.*

ఒక ఊరిలో మంగయ్య అనే మంగలి ఉండేవాడు. అతని భార్య లక్ష్మమ్మ. వాళ్లది పేద కుటుంబం. కానీ మంగయ్య చాలా తెలివైనవాడు.

ఒక రోజు మంగయ్య పనిచేసి వస్తూ చెట్టుక్రింద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అంతలో అతని ముందు ఒక రాక్షసుడు ప్రత్యక్షమయ్యాడు.

"హ!హ!హ! నాకు ఆకలిగా ఉంది, నిన్ను తినేస్తా" అని అరిచాడు.

ఒక్కక్షణం ఆలోచించిన మంగయ్య "హ!హ! హ!" అని నవ్వేశాడు.

అది చూసి రాక్షసుడు ఆశ్చర్యపోయాడు. "అందరూ నన్ను చూసి భయ పడతారు కదా, వీడు ఎందుకు నవ్వుతున్నాడు?"

అనుకున్నాడు. "ఎందుకురా, అట్లా నవ్వుతున్నావు?" అని అడిగాడు మంగయ్యను.

"నువ్వు నన్ను తినేకంటే ముందు నేను నీ ఆత్మనే అంతం చేస్తా. నాదగ్గర వంద మంది రాక్షసుల ఆత్మలున్నాయి తెలుసా? నేను తలచుకున్నానంటే ఆ ఆత్మలన్నిటినీ అంతం చేసేస్తాను. అన్నట్టు, నీ ఆత్మ కూడా నా దగ్గరే ఉంది!" అన్నాడు మంగయ్య, తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో, నవ్వు నటిస్తూ.

రాక్షసుడికి కొంచెం భయం వేసింది- "నా ఆత్మ నీ దగ్గర ఉందా? ఏదీ, చూపించు!" అన్నాడు వాడు.

మంగయ్య తన సంచీలోంచి అద్దం తీసి చూపించాడు. ఆ అద్దంలో ఏముందని చూశాడు రాక్షసుడు. వాడికి అందులో తన ముఖమే కనబడ్డది! తను నోరు తెరిస్తే అదీ తెరుస్తున్నది. తను ఇకిలిస్తే అదీ ఇకిలిస్తున్నది! దాంతో వాడికి 'అది తన ఆత్మే' అని నమ్మకం ఏర్పడిపోయింది.

"అవును! నా ఆత్మ నీ దగ్గరే ఉంది! నన్ను క్షమించు, నా ఆత్మను నాకు తిరిగి ఇవ్వు ప్లీజ్" అని బ్రతిమిలాడాడు వాడు. "అదిగో! అక్కడ, ఆ చెట్టు మొదట్లో పెద్ద నిధి ఒకటి దాగి వుంది. నువ్వు దాన్ని మొత్తం తీసేసుకో. నా ఆత్మను మాత్రం నాకు వెంటనే తిరిగి ఇవ్వు" అని ప్రాధేయపడ్డాడు. కొంచెం సేపు బెట్టు చేశాక, మంగయ్య "సరే" అన్నాడు. ఏదో మంత్రం చదివినట్లు చదివి, ఈసారి అద్దం తిరగేసి చూపించాడు. రాక్షసుడికి తన ప్రతిబింబం కనబడలేదు. వాడు హాయిగా ఊపిరి పీల్చుకొని మాయమైపోయాడు.

మంగయ్య, లక్ష్మమ్మ నిధిని త్రవ్వి తీసుకొని హాయిగా జీవించారు.

**ఇంపాజిబుల్ ఈజ్ పాజిబుల్!** **జోకు**

సుబ్బు: మామ్! నేను ఇవ్వాళ్ల 'ఇంపాజిబుల్' ను 'పాజిబుల్' ఎలా చేయాలో తెలుసుకున్నా.

తల్లి: ఎలా?

సుబ్బు: 'ఇంపాజిబుల్' లో మొదటి రెండు లెటర్లు తీస్తే సరి.

*సేకరణ: సోమిరెడ్డి, నల్గొండ*



# పెద్దల మాట-చద్ది మూట

అమ్మ చెప్పిన కథలు

*హర్షవర్ధన్ వాళ్ల అమ్మ వాడికి భలే భలే కథలు చెబుతుంటుంది. వాడు ఆ కథలన్నిటినీ తన పేరు మీద పంపిస్తుంటాడు. అయినా ఆ కథలన్నీ బాగుంటై కనక, వాడికోసం, మీకోసం వాటిని ఉత్సాహంగా ప్రచురిస్తాంటాం.. ఈకథచూడండి, ఎలాఉందో-*

*రచన:పి.హర్షవర్ధన రెడ్డి, మూడవ తరగతి, టింబక్టు బడి.*

వసంతపురం అనే ఊరు సముద్రతీరానికి దగ్గరగా ఉంది, ఒక కొండ మీద. కొండ దిగువన, సముద్రం ఒడ్డున గంగమ్మ గుడి ఉన్నది. కొండ మీద ఉన్న కుటుంబాల వాళ్ళందరికీ గంగమ్మ ఆరాధ్య దైవం. ప్రతి ఏటా పంట కోతలు, నూర్పిళ్ళు అయిన వెంటనే సముద్ర తీరాన గంగమ్మ జాతరచేస్తారు వాళ్లంతా.

ఆ ఊళ్ళో వెంకయ్య అనే ముసలి తాత ఒకడు ఉన్నాడు. తాత జీవిత అనుభవం చాలా

గొప్పది. తాతకు కొడుకులు కోడళ్లు లేరు. ఒక్క మనవడు మాత్రం ఉన్నాడు. వాడి ఆసరాతోటే తాత నెగ్గుకొస్తున్నాడు.

ప్రతి సంవత్సరం లాగానే ఆ సంవత్సరం కూడా గంగమ్మ జాతర మొదలైంది. ఊళ్ళో జనాలంతా ఆనందోత్సాహాలతో కొండ దిగారు. సముద్ర తీరాన ఉన్న గుడి దగ్గరకి వచ్చారు. అందరూ అమ్మవారిని ఊరేగిస్తున్నారు. ఎక్కడెక్కడినుండో వచ్చిన బంధువులు, రంగు రంగుల కొత్త బట్టలు, సందడిగా డప్పుల దరువులు, కోలాహలం. హడావిడి చేస్తున్న జనాలతో కొండ క్రింద మిట్ట అంతా కిటకిటలాడిపోతున్నది.

తాతది ముసలితనం. కొండ దిగితే మళ్ళీ ఎక్కలేడు. అందుకని ఇంటి దగ్గరే ఆగిపోయాడు. ఆయన మనవడు, పదేళ్ల రవి కూడా తాతకు తోడుగా కొండ మీదే ఆగిపోయాడు. రవికి కూడా కొండ దిగి జాతరకు వెళ్ళాలని ఉంది; కానీ ఎందుకనో ఆ రోజున తాత వెళ్ళనివ్వలేదు. 'సరేలే, తాత నిద్రపోయాక వెళ్దాం' అని చూస్తున్నాడు రవి.

అంతలో పడుకొని ఉన్న తాత దిగ్గునలేచాడు. నాలుగు వైపులా చూశాడు. గట్టిగా గాలి పీల్చాడు. ప్రకృతిలో వచ్చిన వింత మార్పులను గమనించాడు. హడావిడిగా లేచి నిలబడ్డాడు. వెంటనే రవితో చెప్పి కిరసనాయిలు డబ్బా తెప్పించాడు. గబగబా గడ్డి వాముల దగ్గరికి వెళ్ళాడు. కిరసనాయిలు వాముల మీద చల్లి నిప్పంటించాడు. మరుక్షణం వాములన్నీ అంటుకొని కొండమీద అంతటా పెద్ద పెద్ద మంటలు లేచాయి!

కొండకింద జాతరలో ఉన్న జనాలు మంటల్ని చూసారు. పాలోమంటూ కొండ పైకి వచ్చారు. అందరూ కలిసి మంటల్ని ఆర్పివేశారు. 'మంటలు ఎలా రేగాయి..? ఇక్కడ ఉన్నది తాత ఒక్కడే కదా?' అని ఆలోచనలోపడ్డారు.

అయితే అక్కడ కొండమీద మంటలు ఆరిపోయిన కొంత సేపటికి, సముద్రంలో రాకాసి అలలు పుట్టాయి! తాటి చెట్టున లేచిన అలలు తీరాన్ని తాకి కొండను మొత్తాన్నీ

ధడధడలాడించాయి. ఉప్పొంగిన సముద్రంలో గంగమ్మ గుడి దగ్గరున్న కొబ్బరి చెట్లుకూడా పూర్తిగా మునిగిపోయాయి.

ఇదంతా చూసిన జనాలకు అర్థమయింది- సునామి నుండి తాము తప్పించుకున్నామని.

ప్రకృతిలో మార్పుల్ని గుర్తుపట్టి, సమయస్ఫూర్తితో అంతమంది ప్రాణాలను కాపాడిన తాతను అందరూ మెచ్చుకున్నారు.

ఎవరికి వాళ్ళు తాతకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు.



వెంగళప్ప: పదోతరగతి పుస్తకమివ్వండి.

పుస్తకాల షాపు వ్యక్తి: లేవండి.

వెంగళప్ప: అయితే, అయిదో తరగతివి రెండివ్వండి......?

(సేకరణ: సోమిరెడ్డి)


ఆమాత్రం లెక్కలు రావాండి?



ఏనుగు: ఓ చీమా! నన్ను చూసి చెట్టుచాటున దాక్కున్నావు ఎందుకు? నేనంటే నీకు భయమా?

చీమ: నాకేం భయంలేదు. నా కాలు అడ్డం పెట్టి నిన్నుక్రింద పడేద్దామని చెట్టు చాటుకు వెళ్ళాను.

నువ్వే భయపడాలి!



# మూడు మంచి పనులు



మూలం:పి.విశ్వనాథ్, 7 వతరగతి, ప్రకృతిబడి.
కథనం, మార్పుచేర్పులు: కొత్తపల్లి.

శ్రీనివాసులు పెద్ద వ్యాపారి, సమాజ సేవకుడూనూ. రాజుగారికి కూడా ఆయనంటే చాలా గౌరవం. రాజ్య సంరక్షణకు సంబంధించిన అనేక విషయాలలో ఆయన శ్రీనివాసుల్ని సంప్రతిస్తుంటారు. శ్రీనివాసులికి ముగ్గురు కొడుకులు. మొదటి వాడి పేరు సుధీరుడు. రెండవ వాడు ప్రతాపుడు. చివరివాడు చంద్ర. వాళ్లలో ఒకరిని సైన్యంలో అధికారిగా చేర్చమని రాజుగారి అభ్యర్థన.

ఒకరోజు శ్రీనివాసులు కొన్ని పత్రాలను చేతబట్టుకొని తన ముగ్గురు కొడుకులను పిలిచాడు. "చూడండి, నాయనలారా! నా సంపాదన అంతా ఒక ఎత్తు, పూర్వీకులనుండి వచ్చిన ఈ ఆస్తి ఒక ఎత్తు. దీన్ని పూర్తిగా

సమాజ సేవకోసం వాడాలని నేను నిశ్చయించుకున్నాను. అయితే స్వార్థంలేని సమాజసేవ అందరూ చేయగలిగే పని కాదు- ఆ బాధ్యతను మీలో 'ఎవరికి ఇవ్వాలి' అని నేను ఆలోచిస్తున్నాను. ఇక రాజుగారేమో, మీలో ఒకరిని సైన్యంలోకి పంపమని బలవంతం చేస్తున్నారు. అందుకని, ఇవాళ్ళ మీరు మీకు నచ్చిన చోట్లకు పొండి. మీ మీ ఇష్టాల్ని బట్టి, 'మీరు మెచ్చే, నాకు నచ్చే' పని ఏదైనా, తలా ఒకటి చేసుకొని రండి. మీరు చేసిన పనులను చూశాక, వాటిని బట్టి మీకు బాధ్యతలను పంచుతాను" అని చెప్పాడు.

సుధీరుడు పోతూ ఉంటే వీధిలో కొందరు కుర్రవాళ్ళు అడుక్కుంటూ కనిపించారు. "ఇలా అడుక్కునే బదులు, ఏదైనా పని చూసుకోరాదూ?" అని వాళ్ళని మందలించాడు సుధీరుడు. "మేం పనిచేస్తాం అయ్యా! కానీ ఎవ్వరూ మాకు పని ఇవ్వట్లేదు. అందరూ 'కొత్త వాళ్ళని ఎలా నమ్ముతాం?' అంటున్నారు" అన్నారు వాళ్ళు. సుధీరుడు అప్పటికప్పుడు తమ చిన్న దుకాణంలో వాళ్లకి పని ఇవ్వటమే కాకుండా, వాళ్ళకి సాయం చేసేందుకు ఒక మనిషిని కూడా పెట్టాడు.

ప్రతాపుడు నగర శివార్లలో పోతుంటే ఒక ముసలమ్మ బావిలోకి దూకుతూ కనబడ్డది. అతను గట్టిగా అరుస్తూ ఆమెను వారించబోయేలోగా ఆమె బావిలోకి దూకేసింది! ప్రతాపుడు పరుగున పోయి, అక్కడున్న త్రాడు చివరను ఒక చెట్టుకు ముడివేసి, దాని రెండవ కొసను నడుముకు కట్టుకొని బావిలోకి జారాడు. అప్పటికే నీళ్ళు మ్రింగి కొసప్రాణంతో ఉన్నది ముసలమ్మ! ప్రతాపుడు ఆమెను పట్టుకొని త్రాడు సహాయంతో బయటికి వచ్చి, ఆమె చేత నీళ్లు కక్కించాడు. చాలా అప్పుల పాలైందట ఆ అవ్వ! ఆమె కథ విని ప్రతాపుడి మనసు కరిగిపోయింది. తన దగ్గరున్న డబ్బునంతా ఆమెకు ఇచ్చి, ఆమెను వాళ్ల బంధువులకు అప్పగించి, వెనక్కి తిరిగి వచ్చాడు.

ఇక చంద్ర అడవిలో నడుచుకుంటూ పోతూ ఉంటే ఒక దొంగ అతని మీద పడి, కత్తితో పొడవబోయాడు. చంద్ర చటుక్కున అతని

చేయి వడిసి పట్టాడు. ఆ పెనుగులాటలో జారి పక్కనే ఉన్న లోయలోకి పడిపోయాడు దొంగ! అతను పైకి వస్తాడని చంద్ర కొంచెం సేపు ఎదురు చూశాడు- గంట గడిచినా వాడి జాడ లేదు!



చివరికి చంద్ర తనే మెల్లగా లోయలోకి దిగి చూశాడు. దొంగ కాళ్ళు రెండూ విరిగాయి- అక్కడ ఒక పొదలో ఇరుక్కొని మూలుగు- తున్నాడు. బాగా శ్రమపడి అతన్ని లోయలోంచి పైకి ఎత్తుకొచ్చాడు చంద్ర. తనకు తెలిసిన ఆకు పసరులతో ప్రాథమిక వైద్యం చేసి కట్లు కట్టాడు. అటుపైన తనే పోయి, అతన్ని వాళ్ళ ఊరికి చేర్చి వచ్చాడు.

ఆరోజు రాత్రి ముగ్గురూ ఇంటికి చేరుకున్నాక, శ్రీనివాసులు వాళ్లని ముగ్గురినీ పిలిచి దగ్గర కూర్చోబెట్టుకొని, ఎవరు ఏం చేసారో కనుక్కున్నాడు.

"అడుక్కునే కుర్రవాళ్లను చిన్నదుకాణంలో పనికి పెట్టాను. వాళ్లను గమనించుకొమ్మని మన సూరయ్యను నియమించాను" అన్నాడు సుధీరుడు.

"బావిలోకి దూకి ముసలమ్మను కాపాడాను" అన్నాడు ప్రతాపుడు.

"నేను చేసింది మంచి పనో కాదో తెలీదు గానీ, కాళ్ళు విరిగి పడిపోయిన దొంగను లోయలోంచి పైకి తెచ్చి వాళ్ళ ఊరికి చేర్చాను" అన్నాడు చంద్రం.

శ్రీనివాసులు ముగ్గురినీ మెచ్చుకొని, తన వ్యాపారాన్ని సుధీరుడికి అప్పగించాడు. ప్రతాపుడినేమో సైన్యంలో పని చేసేందుకు రాజాస్థానానికి పంపాడు. ఇక సమాజసేవా కార్యక్రమాన్ని చంద్రానికి అప్పజెప్పాడు. అట్లా ఎలా నిర్ణయించాడో చెప్పండి, చూద్దాం?!



# రాజకుమారి-దొంగ సాధువు



*కథనం: తబ్బిబ్బు మహానందప్ప, విశ్రాంత ఉపాధ్యాయులు, మైదుకూరు, కడప జిల్లా*

ఆ రోజు నిండు పున్నమి. వెన్నెల రాత్రి. ఎప్పటి లాగే తాతయ్య చుట్టూ చేరి, చెట్టు కింద అరుగుపై కూచున్నారు పిల్లలందరూ!

'తాతయ్యా! ఈరోజు రాజకుమారి కథ చెబుతానన్నావు గదా! మరి చెప్పు తాతయ్యా!' వాసు అడిగాడు. సుశీ, శశీ, రేఖ, కళా అందరూ వంత పాడారు. పిల్లల ఉత్సాహాన్ని చూసి, తాతయ్య మెల్లగా గొంతు సవరించుకున్నాడు. ఆప్యాయంగా పిల్లలవంక చూసి, ఇలా చెప్పసాగాడు:

సిరిపురం రాజు గారికి నలుగురు మగ సంతానం ఉన్నారు. అయితే 'ఆడపిల్ల లేదే' అని దిగులు పడేవారు రాణి గారు. కొన్నాళ్ళకు ఆస్థాన జ్యోతిష్కులు చెప్పినట్లు రాణిగారు ఆడపిల్లను ప్రసవించింది.

పాప బొటన వ్రేలిమీద శనగగింజంత పుట్టు

మచ్చ ఉంది. ఆ పాపకు 'సుగుణ' అని పేరు పెట్టారు. తల్లిదండ్రులు ఆ పాపను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు; ఆనందిస్తున్నారు. నలుగురు అన్నలకూ ఆ పాప ముద్దుల చెల్లి.



మెల్లగా సుగుణకు ఆరేళ్ళ వయసు వచ్చింది. తోటి పిల్లలతో ఆడుకుంటూ హాయిగా గడిపేది. ఒక సారి, హోళీ పండుగ వచ్చింది. పిల్లలంతా నగరానికి వెలుపలనున్న ఉద్యానవనానికి వెళ్తున్నారు- ఉయ్యాలలూగేందుకు. తానూ వెళతానని మారాం చేసింది సుగుణ. రాణి ఎంతగా నచ్చజెప్పినా వినలేదు. పట్టుబట్టి, అమ్మా నాన్నలను ఒప్పించి, తానుకూడా పిల్లలవెంట వెళ్ళింది. ఆటపాటలతో, కేరింతలతో ఎంత సమయం గడిచిందో గమనించ లేదు. సూర్యుడు పడమటి కొండల్లోకి దిగి పోయాడు. క్రమంగా చీకటి పడుతోంది. పిల్లలందరూ తలోదారిన పోలోమని పరుగెత్తుతున్నారు.

సుగుణ ఎప్పుడూ బయటకు వచ్చింది కాదు గదా, ఆ సందడిలో తనకు తోచిన దారిన వెళ్ళింది. కాసేపట్లో దట్టమైన చెట్లు, పొదలు ఉన్న అడవి ప్రాంతం చేరుకున్నదామె. ఇంక ఆపైన ఎటు వెళ్ళాలో తెలీలేదు ఆ పాపకు. బిత్తరపోయి నిలబడింది. సమయం గడచిపోతోంది. ఇల్లు చేరే దారి తోచటం లేదు. అంతలో చీకటి పడ్డది. గాలికి చెట్లు ఊగుతుంటే నేలమీద వింతవింత నీడలు కదులుతున్నాయి. చిన్నారి సుగుణకు భయం వేసింది. ఒక చెట్టు క్రింద కూర్చొని ఏడవటం మొదలు పెట్టింది. భయంగాను, ఆకలిగాను ఉంది. బేలగా ఏడుస్తూ ఉంది.

అంతలో ఒక సాధువు అటుగా వచ్చాడు. బవిరి గెడ్డంతో, జడలు కట్టిన జుట్టుతో,

మాసిపోయిన కాషాయ వస్త్రాలతో వింతగా ఉన్నాడు అతను. ఏడుస్తూ కూచున్న సుగుణను చూశాడు. అమ్మాయి ఒంటిమీది బంగారు నగలను గమనించాడు. నగలతో బాటు, అమ్మాయిని కూడా తీసుకొని పోతే తనకు ముందు ముందు లాభం ఉంటుందని లెక్కలు వేసుకున్నాడు.

పాప దగ్గరికి వెళ్ళి ఓదార్చాడు. 'ఇంటికి చేరుస్తానులేమ్మా' అని చెబుతూ, తానుంటున్న ప్రాంతానికి తీసుకొనిపోయాడు. తెల్లారిన తరువాత నగరానికి వెళదామని చెప్పి, ఏడుపు మానిపించాడు. తన దగ్గర ఉన్న ఒక పండును ఇచ్చి తినమన్నాడు. తరువాత నిద్రపుచ్చాడు.

"అయితే తాతయ్యా! పాప వాళ్ళ అమ్మానాన్నలు కంగారు పడలేదా, పాప రాలేదని?" పిల్లలందరూ ఒకేసారి అడిగారు.

"ఎందుకు బాధపడరూ?! రాజకుమారాయె! అందునా లేక లేక కలిగిన అమ్మాయాయె! సుగుణ తల్లిదండ్రులు భటులతో నగరంలోను, చుట్టుపక్కల అంతటా వెతికించారు. కాని ఎవ్వరూ ఆ పాప జాడమాత్రం కనుక్కోలేకపోయారు. ఆ వార్త విని రాజుగారు,రాణిగారు దు:ఖ సముద్రంలో మునిగిపోయారు"

ఇక్కడ అడవిలో సాధువు ఆ పాపకు మాయమాటలు చెప్పి, భయపెట్టి, బెదిరించి, తనతోపాటే ఉంచేసుకున్నాడు. ఒకచోట అంటూ నిలవకుండా తనతోబాటు ఆ పాపను కూడా వేర్వేరు ప్రాంతాలకు తిప్పుకుంటూ, భిక్షాటన చేయించటం మొదలు పెట్టాడు. తన జీవితానికి మంచి ఆసరా దొరికిందని ఆనందపడసాగాడు!



ఊళ్ళలో జనాలంతా పాప అందానికి

ఆకర్షితులయ్యేవాళ్ళు. ఆ పాప ముద్దు మోము చూసి, తమ పిల్లలు వాడి వదిలేసిన పాత గుడ్డలు ఇచ్చేవారు. వాళ్ళు తనకు ఏమిచ్చినా సుగుణ సాధువు దగ్గరికి తీసుకెళ్ళి ఇచ్చేది. సాధువంటే విపరీతంగా భయపడేదామె- ఊళ్ళోవాళ్ళు ఇచ్చిన తినుబండారాలనుకూడా తను తినేది కాదు. సాధువు పెడితే తినేది, లేక పోతే ఆకలితో మాడిపోతూ అట్లానే ఉండేది.

అట్లా నాలుగు సంవత్సరాలు గడిచాయి. ఈ నాలుగేళ్లలోనూ సుగుణ తన గురించి తాను పూర్తిగా మరిచిపోయింది. తను ఒక రాజకుమార్తె అని, తనకు అమ్మానాన్నలు,అన్నలు ఉన్నారని, చిన్నప్పుడంతా చాలా గారాబంగా పెరిగిందనీ- ఏమీ గుర్తులేదు, ఆపాపకు.

అయితే అక్కడ రాణి మాత్రం సుగుణను తలచుకొని రోజూ ఏడుస్తూనే ఉన్నది. దాన్ని చూసి పిల్లలు నలుగురూ ఇక తట్టుకోలేకపోయారు. ఒక రోజున నలుగురూ కలిసి తల్లిదండ్రుల్ని ఒప్పించారు. చెల్లెల్ని వెతుక్కొని వచ్చేందుకుగాను దేశాటన మొదలు పెట్టారు. అట్లా దేశం అంతటా తిరుగుతూ తిరుగుతూ వాళ్ళు ఒక రోజున ఒక నగరం చేరుకున్నారు.

సరిగ్గా ఆ సమయానికే సాధువు, సుగుణ ఆ నగరంలోకి ప్రవేశించారు. 'సుగుణా, నేను అలసిపోయాను. ఇక్కడ పడుకుంటాను; నువ్వెళ్ళి నాకు కాసిని నీళ్ళు తెచ్చిపెట్టు. ఇక్కడికి దగ్గర్లో బావి ఎక్కడ ఉన్నదో వెతుక్కో, సరిగా" అని, ఊరి శివార్లలోనే ఒక చెట్టుక్రింద పడుకున్నాడు సాధువు.

సుగుణ వెళ్ళి వెతికితే దూరంగా ఒక చేద బావి కనబడింది. ఆ పాప బావి దగ్గరికి పోయి కాళ్ళు కడుక్కుంటుంటే అదాటుగా చూశారు వాళ్ల అన్నలు!

సుగుణని చూడగానే 'ఆ పాప మా చెల్లెలు లాగా ఉందే' అని అనుమానం వచ్చింది అన్నయ్యలు నలుగురికీ. అంతలో ఆ పాప పాదంమీద పుట్టుమచ్చ కనబడింది వాళ్లకు. ఇంకేముంది, ఒకరితో ఒకరు గుసగుసలాడారు వాళ్ళు. 'ఆ పాప తమ

చెల్లెలే' అని నిశ్చయానికి వచ్చారు. కానీ ఆ పాప మాత్రం వీళ్ళను గుర్తుపట్టనేలేదు! మరెలాగ?

అందుకని నలుగురూ వెళ్ళి ఆ సాధువుకు గౌరవంగా నమస్కరించారు. 'మీరు మాతోబాటు మా నగరానికి రావాలి, మమ్మల్ని పావనం చెయ్యాలి' అని మర్యాదగా మాట్లాడారు. వాళ్ల మర్యాదకు సాధువు మురిసిపోయాడు. పాపతో బాటు బయలుదేరి వాళ్ల నగరానికి పోయాడు. అక్కడి భవనాలు చూశాక అతనికి ఇంకా సంతోషమైంది. ఇంతటి రాజకుమారులు నాకు శిష్యులు అయ్యారు! అని సంబర పడ్డాడు. రాజకుమారులు సాధువును విశ్రాంతి మందిరంలో ఉంచి, అన్ని సౌకర్యాలూ కల్పించారు. "మీకేం కావలసినా కబురు చెయ్యండి" అని చెప్పి, సుగుణను వెంటబెట్టుకొని ఇంటికి వెళ్ళారు.

సుగుణను చూడగానే రాజు రాణి ఆ పాపను గుర్తుపట్టారు. రాజకుమారులు వాళ్లకు విషయం అంతా వివరించారు. 'ఇన్నాళ్ళకు తన కూతురు తిరిగి వచ్చింది' అని రాణి ఎంత సంతోషపడిందో చెప్పలేను. సుగుణకు స్నానం చేయించింది; మంచి బట్టలు కట్టించింది; దగ్గర కూర్చోబెట్టుకొని ప్రేమగా మాట్లాడింది; పాపనుండి అసలు విషయాలన్నీ తెలిసాయి. దాంతో సాధువు చేసిన మోసం తెలిసిపోయింది పాపకు కూడా. తనకు తల్లిదండ్రులు, అన్నలు ఉన్నారని, తనకోసమే పరితపిస్తూ ఉన్నారని తెలిసి ఆ పాపకు ఎక్కడలేని ఆశ్చర్యం వేసింది.




మరునాడు పాపను, సాధువును సభలోవిచారించారు. సాధువు స్వార్థబుద్ధి తేట తెల్లం అయ్యింది. తన నేరాన్ని ఒప్పుకున్నాడు సాధువు. రాజుగారు అతనికి

కఠిన కారాగార శిక్ష విధించారు. అట్లా సుగుణ మళ్ళీ తల్లిదండ్రులను,అన్నలను చేరింది. సంతోషంగా ఉంది" ముగించాడు తాతయ్య.

"మరి అక్కకు పెళ్ళి చేశారా? లేదా?" అనిశశి, రవి, వాసు, రేఖ అడిగారు.

"మీకు అన్నింటికీతొందరేనర్రా! ఆమెకు తగిన వయస్సు వచ్చాక తమ పొరుగు దేశపు రాజకుమారుడితో వైభవంగా పెళ్ళి జరిపించారు. అతిథులందరికీ భోజన తాంబూలాలే కాకుండా కానుకలు కూడా ఇచ్చి పంపారు" అని నవ్వాడు తాతయ్య.

పిల్లలందరు ఆవలిస్తూ పడకలపై వాలారు. ఆరోజు రాత్రి వాళ్ళకొచ్చిన కలల్లో శశి, రేఖ, సుశీ, కళ అందరూ సుగుణలైపోయారు. అబ్బాయిలందరూ అన్నలైపోయి, తప్పి-పోయిన చెల్లెళ్ళందరినీ వెతికిపెట్టారు!

జోకులు

## నిజంగా వెంగళప్పే!

వెంగళప్ప కొడుకు: మా నాన్న చాలా ధైర్యవంతుడు. పులి బోనులోకి వెళ్ళాడు...

రాము: అబ్బ! అవునా!? బయటికివచ్చాక అందరూ భలే మెచ్చుకుని ఉంటారు!

వెంగళప్ప కొడుకు: బయటకు వచ్చాడని నేను చెప్పలేదు.

## అతి జాగ్రత్త!

చింటూ: ఎక్స్‌ప్రెస్ ఎప్పుడొస్తుందండి?

T.C: రెండింటికి.

చింటూ: ప్యాసింజర్?

T.C: మూడింటికి.

చింటూ: మరి గూడ్స్?

T.C: ఇంతకీ నువ్వు ఎటు వెళ్లాలి?

చింటూ: రైలు పట్టాల అవతలకి!!

*సేకరణ: సామిరెడ్డి, నల్గొండ*



# పెద్దపులి బద్ధకం

*కొత్తపల్లి-38 లో ఇచ్చిన 'బొమ్మకు కథ రాయండి' కి స్పందన..*
*రచన: శ్రీమతి రాధ మండువ, ఉపాధ్యాయిని, ఋషివ్యాలీ స్కూల్, మదనపల్లి, చిత్తూరు జిల్లా.*

అనగా అనగా గుట్టూరు కనుమలో పెద్ద రావి చెట్టు ఒకటి ఉండేది. కొత్తగా పెళ్ళయిన చిలుకల జంట ఒకటి వచ్చి దానిమీద కాపురం పెట్టుకున్నది. చెట్టును ఆనుకుని ఉన్న గుహలోనే ఒక పెద్దపులి ఉండేది. చిలకలను చూడగానే అది బయటకి వచ్చి ఆప్యాయంగా పలకరించింది. చిలుకలకు దాని కలుపుగోలు-తనం చాలా నచ్చింది. ఇక అప్పటినుండి అవి మూడూ రోజూ కాసేపు కలిసి కూర్చొని కబుర్లు చెప్పుకోవడం మొదలు పెట్టాయి.

ఒకరోజు పెద్దపులికి ఆరోగ్యం బాలేదు. ఆరోజున అది వేటకు వెళ్ళలేక, గుహలోనే ఉండిపోయింది. అయితే ఆ రోజు ఆహారం కోసం ఎగురుతూ వెళ్తున్న చిలుకలకు చనిపోయిన దుప్పి ఒకటి కనిపించింది, దారిలో. దాన్ని చూడగానే వాటికి పులి గుర్తుకు

వచ్చింది-"పాపం, అది ఇవాళ్ళ వేటకు పోలేదు కదా!" అనుకున్నై . అందుకని మగ చిలుక వెనక్కు వెళ్ళి, "నేస్తం! ఈరోజు వేటాడే శ్రమ తప్పింది నీకు. ఇక్కడికి దగ్గర్లో ఒక దుప్పి చనిపోయి ఉంది. తిందువుగాని రా!" అని అంది. అప్పటికే ఆకలితో నకనకలాడుతున్న పెద్దపులి సంతోషంగా చిలుక వెంట వెళ్ళి ఆహారాన్ని తెచ్చుకుంది.

ఆ రోజు నుండి వాటి స్నేహం మరింత బలపడింది. ఏదైనా చనిపోయిన జంతువు కనబడగానే చిలుకలు పనిగట్టుకొని పోయి పులికి చెప్పేవి. అలా పెద్దపులికి వేటాడాల్సిన పని లేకుండా, సులభంగా ఆహారం దొరకసాగింది. చివరికి ఇది ఎంతవరకు పోయిందంటే, బ్రతికి ఉన్న జంతువుల ఉనికిని కూడా చిలుకలు పులికి చెప్పటం మొదలు పెట్టాయి. వెంటనే పెద్దపులి అక్కడికి వెళ్ళి వాటిని చంపి తినసాగింది. ఇట్లా రోజులు గడుస్తున్నకొద్దీ పెద్దపులి బద్ధకం కూడా ఎక్కువౌతూ పోయింది.

అలా ఉండగా ఒక రోజున ఆడచిలుక గ్రుడ్లు పెట్టింది. వాటిని కాపాడుకుంటూ ఉండాలి కదా, అందుకని ఇప్పుడు చిలుకలు ఎక్కువ దూరం వెళ్ళడం లేదు- రావి చెట్టుకు దగ్గరలోనే దొరికే పండ్లతో కాలక్షేపం చేస్తున్నాయి. దాంతో పెద్దపులికి పెద్ద చిక్కు వచ్చి పడింది. సొంతగా వేటాడటం అది ఎప్పుడో మరచి పోయింది! ఇప్పుడు వెతుక్కుంటే సరైన ఆహారం దొరకట్లేదు మరి! అందుకని దానికి చాలా కోపం వచ్చింది . అది మగ చిలుకను పిలిచి "నీ భార్య గ్రుడ్లను కాపాడుకుంటూ ఇక్కడే ఉంటుందిలే; నువ్వు నా వెంట వచ్చి, ఆహారం వెతకడానికి సహాయం చేయి. నీ సాయం లేకపోతే నేను వేటాడలేను" అంది కరకుగా.

'పెద్దపులికి ఇట్లాంటి అలవాటు చేయడం నేను చేసిన తప్పు. ఇప్పుడు బాధపడి ప్రయోజనం లేదు. పిల్లలు కొంచెం పెద్దవాళ్ళయ్యాక ఇక్కడ నుండి వేరే ప్రదేశానికి వెళ్ళిపోతాం. ప్రస్తుతానికి మరో మార్గం లేదు'` అనుకున్న మగచిలుక, ఆడచిలుకకు జాగ్రత్తలు చెప్పి, పెద్దపులితో బయలుదేరి వెళ్ళింది.

ఏం ఖర్మో, ఏమో! ఆ రోజు అడవిలో ఎంత వెతికినా ఒక్క జంతువు కూడా కనబడలేదు వాటికి. అవి నడుచుకుంటూ దాదాపు గిరిజన వాడ దగ్గరికి వెళ్ళాక, అక్కడ ఒక పంది కనిపించింది. పులి సంతోషంగా దాని మీదికి దూకి, చంపి తినటం మొదలు పెట్టింది.

అంతలో గిరిజనుడొకడు విల్లంబులతో పరిగెత్తుకు రావడం చూసింది చిలుక. వెంటనే అది పులిని హెచ్చరించి ఎగిరిపోసాగింది. తేరుకున్న పెద్దపులి కూడా గాభరాగా పరిగెత్తడం మొదలుపెట్టింది. అయితే అలవాటు తప్పిపోవడం వల్ల కాబోలు, దానికి విపరీతమైన ఆయాసం వచ్చింది. ఆ రోజున అది తప్పించుకున్నదంటే కేవలం దాని అదృష్టమే. చివరికి ప్రాణాలు కడబట్టిన పులి వగరుస్తూ, నిదానంగా తన గుహ వైపు నడుస్తూ 'అయ్యో! ఒకప్పుడు ఎంత వేగంగా పరిగెత్తేదాన్ని! ఇప్పుడు ఇట్లా బద్ధకంగా తయారవడానికి కారణం- నా పని నేను చేసుకోకుండా చిలుకల మీద ఆధారపడటం! అందు వల్లనే కదా, ఇట్లా అయ్యింది!' అని విచారించసాగింది.

ఇంటికి చేరిన చిలుకకు ఏడుస్తున్న భార్య ఎదురైంది. "ఏమైంది, ఏమైంది?!" అని అది ఆడచిలుకను అడిగింది కంగారుగా.



"మీ కోసం చాలా సేపు ఎదురు చూశాను.

ఆకలికి తాళలేక, పండ్లు తెచ్చుకుందామని అలా బయటకు వెళ్ళాను. వచ్చి చూసేటప్పటికి రెండు గ్రుడ్లు మాయమయ్యాయి!" అన్నదది, ఏడుస్తూ.

అప్పుడే అక్కడికి చేరిన పెద్దపులి ఈ మాటలు విన్నది. దు:ఖిస్తున్న మగచిలుక దగ్గరకు వెళ్ళి "మిత్రమా! క్షమించు! అవసరం లేకపోయినా నాకు సహాయం చేయడం నీ తప్పు; నా పని నేను చేసుకోకుండా, 'సాయం చేస్తున్నావు కదా'-అని నీ మీద ఆధారపడటం నా తప్పు. మీ గ్రుడ్లను కాజేసింది జిత్తులమారి నక్కే అని నా అనుమానం. రేపు ఇదే సమయానికి అది మళ్ళీ వస్తుంది; మనిద్దరం దాన్ని పట్టుకుందాం. లే! బాధ పడకు! కొంచెం విశ్రాంతి తీసుకో!" అన్నది.

రాత్రి గడిచింది. మర్నాడు చిలుక, పెద్దపులి పొదలలో కాపు కాశాయి. ఆడచిలుక కూడా గూటికి దూరంగా కూర్చొని గమనించ సాగింది. కొంచెం సేపటికి నక్క రానే వచ్చింది! అటూ ఇటూ చూసుకుంటూ మెల్లగా రావి చెట్టు దగ్గరకు వచ్చి, మిగిలిన గ్రుడ్లకోసం చెట్టు ఎక్కబోయింది. అంతలోనే పులి ఒక్క దూకున చెట్టు దగ్గరకు వెళ్ళి, పంజా విసిరి, నక్కని చంపేసింది.

ఆ తర్వాత పెద్దపులి బద్ధకాన్ని జయించింది. మళ్ళీ తన ఆహారాన్ని తను స్వయంగా సంపాదించుకోవటం మొదలు పెట్టింది. అంతేకాదు, బిడ్డలకు కాపలాగా ఉన్నన్ని రోజులూ అదే స్వయంగా చిలుకలకు రకరకాల పండ్లను తెచ్చిపెట్టింది!

జోకు

కొత్త రామాయణం!

టీచర్: సీతా, లక్ష్మణుడు వాళ్ల అన్నపేరు ఏంటో చెప్పమ్మా?

శ్వేత: ఆగండి టీచర్! అక్ష్మణుడిని అడిగివస్తాను ప్లీజ్!

*సేకరణ: మమత, ఎనిమిదోతరగతి, వెంకటంపల్లి.*




# నమస్కారం!

*"..అందుకని, మనం రెండు విషయాలను గుర్తించాలి. ఒకటి, గౌరవం అనేది ముందుగా యిచ్చి-ఆ తర్వాత పుచ్చుకోవాల్సిన వస్తువు. ఇతరులను మనం గౌరవించినప్పుడే వాళ్ళు మనల్ని గౌరవిస్తారు. ఇక రెండవది, అనుకున్నది సాధించే వరకూ నిరాశపడకుండా ప్రయత్నిస్తూ పోవాలి. నిరాశపడటం వల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదు" అంటున్నారు చిన్నారిగారు. ఆ సంగతులు ఈ కథ చదివితే తెలుస్తాయి..*

*రచన: చిన్నారి(నిజానికి పెద్దాయనే, ఇది ఒట్టి కలం పేరు!), హైదరాబాదు.*

గోపాలపురం పాఠశాలలో, చదువుకునే పిల్లల దగ్గర నుండి- చదువు చెప్పే ఉపాధ్యాయుల వరకూ, అందరికీ రాజు అంటే భయమే. అతను కూడా ఆ బళ్ళో స్టూడెంటే; కానీ ఆ ఊరి కామందు నాగరాజు గారి కొడుకు. అందువల్ల స్కూల్లో అతని ఆగడాలకు అడ్డు లేకుండా ఉండేది. ప్రధానోపాధ్యాయులు కూడా 'అనవసరంగా గొడవ ఎందుకులే' అని అతన్ని ఎక్కువగా ఏమీ అనేవారు కాదు.

రాజు అస్సలు చదివేవాడు కాదా, అంటే

-అలాకాదు! బాగా చదువుతాడు, మార్కులు బాగా వచ్చేవి! కానీ అతను తోటి పిల్లల్ని హింసించేవాడు, చిన్నబుచ్చేవాడు; డబ్బు ఉన్నదన్న దర్పం బాగా చూపేవాడు; టీచర్లని అస్సలు గౌరవించేవాడుకాదు; వాళ్ళతో యిష్టం వచ్చినట్లు అగౌరవంగా మాట్లాడేవాడు.

ఒక రోజు వాళ్ళ స్కూల్లోకి కొత్తగావచ్చారు, ప్రకాశం మాస్టారు . ఆయనకి రాజు తీరు వింతగా అనిపించి, మిగిలిన టీచర్లని అడిగితే "అతనా? అతను బాగా డబ్బున్నవాడులెండి. చదువుతాడు, కానీ మనుషులంటే అస్సలు లెక్కలేదు. మీరు అతని గురించి పట్టించుకోకండి!" అని చెప్పారు.

అయితే పిల్లల మనసులు బాగా ఎరిగిన మంచి మాస్టారు ప్రకాశం. ఆయన అన్నారు వాళ్లతో- "ఓహో, అలాగా! సరే, అయితే మీరు చూస్తుండండి, పదిరోజుల్లోగా అతని చేత నమస్కారం పెట్టించుకుంటాను; అంతేకాదు, అతను అందరినీ గౌరవించేట్లు చేస్తాను" అని. నవ్వి ఊరుకున్నారు మిగిలిన టీచర్లు.

కానీ ఆశ్చర్యం! కొన్ని రోజుల తర్వాత టీచర్లంతా స్కూల్లోకి వెళ్తుండగా ఎదురైన రాజు, ప్రకాశం మాష్టారుకి నమస్కారం చెప్పివెళ్ళాడు! టీచర్లు, పిల్లలు అందరూ ఆశ్చర్యపోయారు. టీచర్లంతా ప్రకాశం మాస్టారు చుట్టూ చేరి "ఏం చేశారు మీరు, రాజుని?" అని అడిగారు.

"ఏం లేదండి, నాకు అతను ఎదురైనప్పుడల్లా నేనే నమస్కారం చేసేవాణ్ణి. కొన్నాళ్లు అతను నన్ను పట్టించుకోనేలేదు; అయినా నేను మాత్రం అలా నమస్కారం చేస్తూనే పోయాను. కొన్నాళ్ల తర్వాత అతను నన్ను గమనించాడు. ఆ తర్వాత కొన్నాళ్లకి అతనే ముందుగా నమస్కారం చేయడం మొదలుపెట్టాడు, అంతే! తర్వాత ఒక రోజున అతన్ని పిలిచి దగ్గర కూర్చోబెట్టుకొని 'అందరినీ గౌరవించడం మంచిది' అని ప్రేమగా చెప్పాను. అప్పటి నుండీ అతను మారిపోయాడు" అని చెప్పారు ప్రకాశం మాస్టారు, నవ్వుతూ.




# మంత్రి పదవి

*సరైన అభ్యర్థుల్ని ఎంపిక చేసుకునే కథల్లో బాగా పేరొందిన కథ ఇది. చక్రిగారి కథనంతో పాత కథ కూడా బాగానే పదునెక్కినట్లుంది..*
*సేకరణ,కథనం: చక్రి, సమాలోచన, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లా.*

అనగనగా ఒక ఊరిని ఒక రాజు గారు జనరంజకంగా పరిపాలించేవారు.

తన రోజువారీ కార్యక్రమాలతో అలసిపోయిన రాజుగారు ఆ రోజు రాత్రి హంసతూలికా తల్పం మీద ఆదమరిచి నిద్ర పోతున్నారు..అకస్మాత్తుగా ఆయనకు నిద్రాభంగం అయ్యింది.. కారణం..? తలుపును ఎవరో తడుతున్నారు.

దానితో నిద్ర లేచి సమయం చూస్తే సుమారు మూడు గంటలు అయ్యింది.

"ఎటూకాని ఈ సమయంలో ఎవరు, నన్ను నిద్ర లేపింది?" అని రాజు గారికి విపరీతంగా కోపం వచ్చింది.

కానీ తలుపు తీసి చూసేసరికి రాజు గారి నిద్ర కాస్తా ఎగిరి పోయి, దాని స్థానంలో విస్మయం చోటు చేసుకుంది! కారణం, ఎన్నో ఏళ్ళుగా రాజ్యానికి సేవలందిస్తున్న సేవలందిస్తున్న ముసలి మంత్రి దర్శనం ఇవ్వడమే. ఇంకొకరు ఎవరైనా ఆ సమయంలో రాజు గారికి నిద్రా భంగం కలిగించి ఉంటే వాళ్ల మెడమీద తల నిలిచేది కాదు. ఆయన కోపం అంతటిది. కానీ ఎన్నో దశాబ్దాలుగా రాజ్యానికి ఎనలేని సేవలు అందిస్తున్న మంత్రిగారు వేరు.

ఆయన్ని చూడగానే రాజుగారు "మహామంత్రీ! మీరు, ఈ సమయంలో వచ్చారా? అంతా కుశలమేనా? మన రాజ్యానికి శత్రువులనుండి ఏదైనా ముప్పు ఉందని వర్తమానం అందిందా?" అని ప్రశ్నించారు ఆందోళనతో.

"అట్లాంటివేమీ లేవు, మహారాజా! అయినా ఎవరికీ అలివిగాని ఈ సమయంలో తమరికి నిద్రాభంగం కలిగించినందుకు క్షమించండి. ఇందాక నా కలలో వినాయకుడు, జీసస్, మొహమ్మద్ ప్రవక్త- ఇలా అందరు దేవుళ్ళూ దర్శనమిచ్చి, 'ఓరి మంత్రీ! ఇంకా ఎన్ని సంవత్సరాలు పదవిని పట్టుకొని వ్రేలాడుతావు? పుణ్యం,పురుషార్థం లాంటివి ఏవీ నీకు అక్కరలేదా?' అని నా మీద కోపగించుకున్నారు మహారాజా! దాంతో నాకు జ్ఞానోదయం అయ్యింది. నేను మహామంత్రి పదవి నుండి వైదొలగాలని నిర్ణయించుకున్నాను. దయచేసి అనుగ్రహించండి" అన్నాడు.

రాజుగారికి తల తిరిగి పోయింది. "మంత్రి గారూ, అర్థరాత్రి మద్దెల దరువు అంతే ఇదే! మీరు ఉదయం పది గంటలకు కనిపించండి. నా నిర్ణయం తెలియజేస్తాను" అన్నాడు. మంత్రి సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు. పడుకున్నారు కానీ, రాజుగారికి ఇంక నిద్రమాత్రం పట్టలేదు. ఏమి చెయ్యాలో పాలుపోలేదు: మంత్రి రాజీనామా ఒప్పుకుందామా, అంటే- ఇంత సమర్థుడు ఎక్కడ దొరుకుతాడు? ఒకవేళ రాజీనామా ఒప్పుకోవడం మానేద్దామా- అంటే మంత్రిగారి కోరికలో న్యాయం ఉందిగదా?' అని రకరకాలుగా ఆలోచించి, ఒక నిర్ణయానికి

వచ్చారు.

ఆరోజు పదిగంటలకు మంత్రి తనను కలవగానే రాజుగారు "మంత్రి గారూ! మీ రాజీనామాను నేను ఆమోదిస్తున్నాను. కానీ 'చెడుపు పెట్టిన వారే చెడుపు తియ్యాలి' అంటారు కదా, అట్లాగే మీ వల్ల ఖాళీ అవుతున్న మంత్రి పదవికి సమర్థుడైన వారసుడిని మీరే ఎంపిక చెయ్యాలి" అని అజ్ఞాపించాడు. "మీకు ఒక నెల రోజులు సమయం ఇస్తున్నాను" అన్నాడు. ముసలిమంత్రి సరేనని తలఊపాడు. వెంటనే కొత్త మంత్రిని ఎంపిక చేసే పనిలో పడ్డాడు.

ఈ తంతు అంతా గమనిస్తున్న మహారాణి "ఇదెక్కడి గోల, మహారాజా? ఎంతో అందగాడు, సమర్ధుడు అయిన మా తమ్ముడు వుండగా మళ్ళీ ఇంకో మంత్రి ఎందుకు? తక్షణమే మా తమ్ముడిని ఎంపిక చెయ్యండి" అనింది.

రాజుగారు "ఇదెక్కడి తలనొప్పి వ్యవహారం?" అనుకున్నాడు. అయినా రాజుగారు కదా, మనసులోని మాట బయట పెట్టకుండా చిరునవ్వుతో "మహారాణీ! మీరు కంగారు పడకండి. మంత్రి ఎంపిక చేసి తెచ్చిన వ్యక్తికి, మీ తమ్ముడికీ పోటీ పెడదాం. ఎవరు గెలిస్తే వాళ్ళని కొత్త మంత్రిగా ఎంపిక చేస్తాను" అన్నాడు. తన తమ్ముడి శక్తి యుక్తుల మీద అచంచలమైన విశ్వాసం ఉన్న మహారాణి తక్షణమే అందుకు అంగీకరించింది.

ఆ రోజునుండి రాణిగారి తమ్ముడు మంత్రి పదవిని పొందడానికి చాలా తీవ్రంగా కష్టపడటం మొదలు పెట్టాడు. రకరకాల పుస్తకాలు, శాస్త్రాలన్నీ చదివేశాడు. చూస్తుండగానే నెల రోజులు ఇట్టే గడచి పోయాయి.

ముప్ఫై ఒకటవ రోజున మహామంత్రి ఎవరినో వెంటపెట్టుకొని దర్శనం కోసం వచ్చాడని భటులు వర్తమానం తెచ్చారు. దానితో మంత్రి పదవికి పోటీ ప్రారంభమైంది. మహారాణిగారి తమ్ముడికి, మంత్రిగారు ఎంపిక చేసి తెచ్చిన వ్యక్తికి ఇద్దరికీ మహారాజుగారు ఒక చిన్న పని అప్పగించారు. ఆ పనిని ఎవరు బాగా చేస్తే వాళ్లు మంత్రి అవుతారు. మరి ఏమిటా పని?

కోట గోడ మీదినుండి దూరంగా ఎడ్ల బళ్ళు కనిపిస్తున్నాయి. అవి ఎక్కడకు వెళ్తున్నాయో కనుక్కొని చెప్పాలి. అది, వాళ్ళిద్దరికీ అప్పగించిన పని.




"ఓస్ ఇంతేనా" అన్నాడు రాణిగారి తమ్ముడు. రాజ్యంలోనే అతివేగంగా పరిగెత్తగలిగిన గుర్రాన్నెక్కి బయలుదేరాడు. పదంటే పది నిముషాలలో తిరిగివచ్చి మళ్ళీ రాజు గారి ముందుకు నిలబడ్డాడు-"మహారాజా! ఆ ఎడ్ల బళ్ళు పక్క రాజ్యానికి వెళ్తున్నై. మీరు చెప్పిన పనిని కేవలం పది నిముషాల్లో పూర్తిచేసాను- దయచేసి గమనించండి" అని సెలవు తీసుకున్నాడు.

తరువాత మంత్రి ఎంపిక చేసిన వ్యక్తి వంతు వచ్చింది. అతను పనిమీద బయలుదేరి ఒక గంట గడిచింది., రెండు గంటలు గడిచాయి..అయినా అతని జాడ లేదు. రాణిగారి తమ్ముడు రాజుగారి ప్రక్కనే కూర్చొని సంబరపడుతున్నాడు, 'తన ఎంపిక ఖాయమైనట్లే'అని. నిజానికి రాజుగారికి కూడా సంగతి అర్థం కాలేదు- 'ఇంత చిన్న పనికి అంత సమయం ఎందుకు తీసుకుంటున్నాడో' అనుకున్నాడు. రాణిగారైతే 'ఇంక ఆలోచించకండి! మా తమ్ముణ్ని మంత్రి గా ఎంపిక చెయ్యండి" అని నామజపం మొదలుపెట్టింది. ఐతే రాజుగారు మాత్రం మంత్రి మీద గౌరవంతో 'మరి కొంత సేపు వేచిచూద్దాం' అన్నారు.

చాలా సమయం గడచిన తరువాత వచ్చాడు మంత్రి ఎంపిక చేసిన అభ్యర్థి, గసపోసుకుంటూ- "మహారాజా, ఆ ఎడ్ల బళ్ళు పక్క రాజ్యానికి వెళుతున్నాయి. 'బళ్ల మీద ఉన్న బస్తాలలో ఏమి వున్నాయో' అని పరిశీలించాను. 'ధాన్యం' అని తేలింది. 'అసలే మన రాజ్యం లో కరువు తాండవిస్తూ

ఉంది కదా, మరి మన రాజ్యం నుంచి ధాన్యం ఎందుకు తీసుకుని వెళ్తున్నారు?' అని గట్టిగా అడిగే సరికి, వాళ్ళు శత్రుదేశపు గూఢచారులని తేలింది. మన రాజ్యాన్ని అస్థిరపరచడానికి వాళ్ళు పెద్ద పథకమే వేశారు. ఆ పథకంలో భాగంగానే మన రాజ్యం నించి ధాన్యం తరలిస్తున్నారట. వాళ్ళ కుట్రను ఛేదించి, వాళ్ళందర్నీ రక్షక భటులకు అప్పగించి వచ్చేసరికి ఈ సమయం

తమ్ముడు తల వంచుకున్నాడు. రాజుగారు రాణిగారివైపు చూశారు. రాణిగారు ఓరకంట ఓసారి తమ్ముడిని చూసారు; మళ్ళీ అటువైపుకు కూడా చూడలేదు. కొత్త మంత్రి ఎంపిక పూర్తైంది.

ఇంతకీ ఎవరు ఎంపికయ్యారు? మీరే చెప్పండి, అనుమానం ఎందుకు?




ధర్మారావు: మా గృహప్రవేశానికి మీరంతా తప్పకుండా రావాలి!
వెంగళప్ప: ఓ! అలాగే వస్తాం. ఇంతకీ ఏ ఫంక్షన్ హాల్‌లో చేస్తున్నారు?

సేకరణ: సోమిరెడ్డి




టీచర్: సోమూ! రైలు మీద వ్యాసం రాయమన్నాను. రాశావా?
సోమూ: రాశాను టీచర్
టీచర్: అయితే ఇటివ్వు
సోమూ: రైలు వెళ్లిపోయింది టీచర్....!

సేకరణ: సోమిరెడ్డి



# రంగయ్య గాడిద

*సేకరణ, కథనం: డా.పి.సమీర, మంచిర్యాల, ఆదిలాబాదు జిల్లా.*

అనగా అనగా ఒక ఊళ్లో రంగయ్య అనే చాకలి ఒకడు ఉండేవాడు. అతని దగ్గర ఒక మంచి గాడిద ఉండేది. రోజూ చాకలి తన మీద మోపే బరువులన్నిటినీ, ఎంత కష్టమైనా సరే, అది మోసేది. రంగయ్య కూడా చాలా శ్రమపడి పని చేసేవాడు. అయితే కాలం ఎవ్వరికోసమూ ఆగదు కదా! రాను రాను గాడిద ముసలిదైంది. ఇప్పుడు అది ఇదివరకటంత వేగంగా పని చెయ్యలేకపోతున్నది. రంగయ్యకు ఇప్పుడు అదంటే కొంచెం విసుగు వేస్తున్నది. కొంచెం అసహనంగా ఉంటోంది దాని నెమ్మది తనాన్ని చూసి.

ఒకరోజున రంగయ్యకు ఏదో పని పడి పొరుగూరికి వెళ్తూ, గాడిదను కూడా వెంట తీసుకెళ్ళాడు. తనకు అవసరమైన పనిముట్లు వగైరాలు కొనుక్కొని వెనక్కి బయలుదేరే సరికి సాయంత్రం కావస్తున్నది. ఊరు చేరే సరికి

చీకటి పడిపోవచ్చు! అందుకని రంగయ్య త్వరత్వరగా నడవటం మొదలుపెట్టాడు. కానీ ముసలి గాడిద మెల్లగా నడుస్తున్నది. దాని నడక తీరును చూసి రంగయ్యకు చాలా కోపం వచ్చింది. కట్టె పట్టుకొని దాన్ని అదిలిస్తూ , తిట్టుకుంటూ పోసాగాడు.

ఆ గందరగోళంలో అతను తన కాళ్ళ ముందున్న బండ రాయిని చూసుకోలేదు- మరుక్షణం చాకలి నేల మీద వెల్లకిలా పడిపోతే, అతని గాడిద మాత్రం రోడ్డు ప్రక్కగా ఉన్న- నీళ్ళులేని బోడబావిలో పడిపోయింది!

రంగయ్య వెంటనే లేచి నిలబడ్డాడు. చూడగా గాడిదకు కూడా ఏమంత దెబ్బ తగిలినట్లు లేదు- అది బావిలోంచి పైకి వచ్చేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నది. పైకి చూస్తూ రంగయ్యతో ఏదో చెప్తున్నట్లుగా అరుస్తూ ఉంది. ఎగిరి దూకుతున్నది; దబ్బున క్రింద పడుతున్నది. రంగయ్య కూడా గాడిదకోసం తపనపడసాగాడు. కానీ తను కొత్తగా కొన్న పార తప్ప దగ్గరలో వేరే ఏలాంటి సాధనాలూ లేవు. త్రాళ్ళు, తీగలు, కనీసం లతల లాంటివి కూడా ఏవీ లేవు కనుచూపు మేరలో. అంత లోతైన బావిలో పడ్డ గాడిదను తను ఒక్కడే బయటికి తెచ్చే ఉపాయం కూడా ఏదీ తోచలేదు.

మెల్లగా చీకటి పడుతున్నది.. "ఇక చేసేదేమీ లేదు. గాడిదని బావిలోంచి బయటికి తేవాలంటే తను ఊరికి వెళ్ళి, మోకుల్ని, మరో నలుగురు మనుషుల్నీ తేవాలి. ఈ చీకటిలో అదంతా సాధ్యం కాదు. తెల్లవారే వరకూ బావిలోని గాడిద బ్రతికి ఉంటుందని కూడా నమ్మకం లేదు...అయినా ఈ గాడిద ముసలిదైపోయింది..అంత శ్రమపడి దీన్ని కాపాడుకున్నా, అది నాకు ఇంక ఎంత పని చేసిపెడుతుందో తెలీదు..దానికంటే మరో గాడిదను వెతుక్కోవటమే నయం.." ఇట్లా సాగుతున్నై, రంగయ్య ఆలోచనలు. చివరికి అతను నిశ్చయించుకున్నాడు- 'గాడిదను బావిలోనే వదిలేస్తాడు తను'.

రంగయ్య గాడిదను అక్కడే వదిలేసి ఊరివైపుకు నడవటం మొదలు పెట్టాడు.

అతను లేడని గుర్తించిందో ఏమో, గాడిద మరింత పెద్దగా అరవటం మొదలు పెట్టింది. ఎంత దూరం పోయినా దాని అరుపులు రంగయ్య చెవుల్లో మారుమ్రోగుతూనే ఉన్నాయి. కొంచెం దూరం పోయాక ఇక భరించలేకపోయాడు రంగయ్య. తన చేతిలోని పారని తేరిపార చూసి, వెనక్కి తిరిగి వచ్చాడు దృఢ నిశ్చయంతో- "ఈ గాడిదను బావిలోనే పూడ్చేయటం తప్ప వేరే మార్గం లేదు".

అప్పటికి సూర్యుడు అస్తమించాడు. ఉన్న కాస్త వెలుగులోనే రంగయ్య పని మొదలు పెట్టాడు. పైనుండి మట్టిని బావిలోకి త్రవ్విపోయసాగాడు. "గాడిదని పూడ్చేసేంత మట్టి పోసేందుకు తనకు ఎంత సేపు పడుతుంది..ఒక గంట?..రెండు గంటలు..? ఒక్కసారి అది మట్టిలో మునిగిపోయి నోరు మూసిందంటే తను ప్రశాంతంగా వెళ్ళిపోవచ్చు.."

అకస్మాత్తుగా పైనుండి మట్టి పడేసరికి ముందుగా బిత్తరపోయింది గాడిద. "యజమాని మట్టిని త్రవ్విపోస్తున్నాడు..మరి ఇప్పుడు తను ఏం చేయాలి?" కొంచెంసేపు దానికి ఏమీ అర్థం కాక అలాగే ఉండిపోయింది. ఆ సరికి దాని నడుంవరకు మట్టి వచ్చి పడింది. అంతలో దాని ముఖం వెలిగిపోయింది- "యజమాని నాకోసం ఎంత శ్రమ పడుతున్నాడు!" అనుకున్నది. చకచకా తన మీద పడ్డ మట్టిని దులుపుకున్నది. నడుంలోతు మట్టిలోంచి తన్నుకొని బయట పడింది. ఆ కుప్పమీదికి ఎక్కి కూర్చుంది.

బాగా చీకటి పడింది. పైనుండి రంగయ్య మరింత మట్టిని త్రవ్వి పోస్తున్నాడు బావిలో. గాడిద ఆ మట్టిని దులుపుకుని మళ్ళీ మట్టి కుప్ప పైకి ఎక్కుతూ పోయింది. పైకి వచ్చినప్పుడల్లా కృతజ్ఞతతో అరుస్తున్నది. "ఏంటీ! ఇంకా ఇది పూడిపోలేదు..మన్నంతా ఎటు పోతున్నది?" అని తిట్టుకుంటూనే మరింత మన్ను త్రవ్వి పోస్తున్నాడు రంగయ్య. రాత్రి బాగా పొద్దుపోయే సరికి మట్టి కుప్ప బావి పైవరకు చేరుకున్నది! దాని మీది నుండి గాడిద చటుక్కున బయటకు దూకింది.

సంతోషంతో,కృతజ్ఞతతో తన యజమాని చుట్టూ తిరగసాగింది!



ముందుగా ఆశ్చర్యపోయిన రంగయ్య, తర్వాత తేరుకొని, సిగ్గుపడ్డాడు. తనేమో గాడిదను వదిలించుకునేందుకు మట్టిపోశాడు. పాపం, ఈ పిచ్చి గాడిద, దాన్ని కాపాడేందుకు తను శ్రమిస్తున్నాడనుకున్నది. జరుగుతున్న పనిని మనం చూసే తీరును బట్టే, ఆ పని మనకు మేలో-కీడో చేస్తుంటుంది. పైనుండి పడే మట్టి తనమేలుకోసమే అని మనస్ఫూర్తిగా నమ్మిన గాడిద, ఆ మట్టి ఆధారంగా బయట పడింది. అదే వేరేగా అనుకొని ఉంటే అదే మన్నులోసమాధి అయిపోవును గద!

గాడిద సంతోషాన్ని చూశాక తన ప్రవర్తనకు చాలా సిగ్గుపడ్డాడు రంగయ్య. ఇద్దరూ మెల్లగా ఇంటికి చేరుకున్నారు. అటుపైన రంగయ్యకు గాడిద అంటే ఇష్టం ఏర్పడింది. ఎందుకో మరి, ముసలి గాడిద నెమ్మదితనాన్ని చూసి ఇప్పుడతనికి కోపం రావట్లేదు!

## జోడు కష్టాలు!

జోకు

రాము: ఒరేయ్ నీకు ఒక చెవి కోసేస్తే ఏం జరుగుతుంది?

రాజు:వినబడదు.

రాము:మరి రెండు చెవులు కోసేస్తే?!

రాజు:కనబడదు

రాము:అదెలా?!?

రాజు:రెండు చెవులూ కోసేశాక ఇక నా కళ్లజోడు నిలబడదు కదా?!

*సేకరణ: ఆర్.ప్రగతి, వెంకటంపల్లి.*



# వినటం చేసిన మేలు

*తెలుగునాట రకరకాల రూపాల్లో వినబడుతుంది యీ కథ. విన్న ప్రతిసారీ నవ్వు తెప్పిస్తూనే ఉంది. మీరూ మరోసారి నవ్వుకునేందుకు..*

*సేకరణ,మూలకథనం:ఎ.కె.రామానుజన్, ఫోక్‌టేల్స్‌ఫ్రం ఇండియా.*

*తెలుగు స్వేచ్ఛానుసరణ: నారాయణ,కొత్తపల్లి బృందం.*

రంగాపురంలో నివసించే సోమయ్యకు రామాయణమూ తెలీదు; భారతమూ తెలీదు. ఊరికే తెలీకపోవటం కాదు, అతనికి అవంటే పెద్దగా ఇష్టంకూడా లేదు. అయితేనేమి, అతని భార్య రంగమ్మ మాత్రం శాస్త్రాలన్నా, పురాణాలన్నా చెవి కోసుకుంటుంది. భర్తని మార్చాలనీ, భగవంతుడంటే కొంచెం భయభక్తులు అలవాటు చేయాలనీ రంగమ్మ చేయని ప్రయత్నం లేదు-అయినా సోమయ్య తీరు

సోమయ్యదే -ఒట్టి మొద్దుమనిషి.

ఒకసారి ఊళ్లో రామాయణం చెప్పటానికి వచ్చారు ఒక శాస్త్రులవారు. ప్రతిరోజూ సాయంత్రం ఆయన ఊరి గుళ్లో రామాయణం చెప్పేవాడు. సందర్భానికి తగినట్లు అభినయం, నాట్యం, సంగీతం జొప్పించేసరికి, మొదటి రోజునే ఆ రామాయణ పారాయణం భలే రక్తి కట్టింది. రెండవ రోజు కల్లా శాస్త్రులవారి పేరు ఊళ్లో మారు మ్రోగిపోయింది. ఊరి జనాలంతా సాయంత్రం కాగానే చాపా, దిండూ చంకనపెట్టుకొని గుళ్లోకి బయలు దేరటం మొదలుపెట్టారు.

ఇంట్లో పశువులు ఉన్నాయి,అలా ఇల్లు వదిలిపెట్టి పోయే వీలు లేదు రంగమ్మకు. అందుకని అమె ఎప్పటిలాగానే భర్తను పోరింది-"రామాయణం చాలా బాగా చెబుతున్నారట, పోయి విని రారాదూ?" అని. సోమయ్య కూడాఎప్పటిలాగానే ముందు విననట్లు నటించాడు గానీ, చివరికి భార్య పోరు భరించలేక, కండువా భుజానవేసుకొని బయలుదేరాడు.

సోమయ్య వెళ్లేసరికి ఆ రోజు పురాణం మొదలైపోయింది. ఊరిజనాలంతా భక్తి శ్రద్ధలతో వింటున్నారు. శాస్త్రులవారు ఊపుగా చెబుతున్నారు. సోమయ్య వెళ్లి వెనకవరసలో కండువా వేసుకొని కూర్చున్నాడు. కార్యక్రమం తెల్లవారుజాము వరకూ కొనసాగుతుంది.. సోమయ్యకు మాత్రం కూర్చోగానే తూగు మొదలైంది. కొంచెంసేపట్లో అతను ఇహం మరచి గాఢనిద్రలోకి జారుకున్నాడు. నాలుగో జాము మొదలయ్యేసరికి కార్యక్రమం పూర్తయింది. శాస్త్రులవారు ఆ రోజుకిగాను మంగళం పాడేశారు. అచారం ప్రకారం వెంటనే ప్రసాదం కూడా పంపిణీ చేశారు, అక్కడ చేరిన భక్తజనులందరికీ. పంచేవాళ్లెవరో నిద్రపోతున్న సోమయ్య నోట్లో కూడా ఒక లడ్డూ ముక్క పెట్టి, ముందుకు సాగారు.

దాన్ని నిద్రలోనే చప్పరించేసిన సోమయ్యకు ఆ వెంటనే మెలకువ వచ్చింది. చుట్టూ చూసే సరికి అందరూ లేచి వెళ్లిపోతున్నారు.

సోమయ్య కూడా గబిక్కున లేచి, కండువా దులుపుకొని ఇల్లు చేరుకున్నాడు. భర్త రాత్రంతా రామాయణం వినివచ్చాడని రంగమ్మ మాత్రం మా మురిసిపోయింది. అతనికి ఎదురువచ్చి అడిగింది "ఎలా ఉందండీ, రామాయణం?" అని. "చాలా తియ్యగా ఉంది" అన్నాడు రంగయ్య, లడ్డూరుచిని గుర్తు చేసుకుంటూ. రంగమ్మకి చాలా సంతోషం వేసింది.



ఆ రోజు కూడా సాయంత్రం భోజనాలు కాగానే భర్తను పురాణానికి సాగనంపింది రంగమ్మ. ఈసారి సోమయ్య ఎక్కువ బెట్టు చేయకుండానే బయలుదేరి వెళ్లాడు. మండపంలోనే ఒక మూలగా, గోడను ఆనుకొని కూర్చున్నాడు. ఇంకా పారాయణ మొదలు కాకుండానే నిద్రలో మునిగిపోయాడు. ఆ రోజు శాస్త్రులవారి పారాయణం మొదలయ్యే సరికి సభా ప్రాంగణం అంతా జనాలతో క్రిక్కిరిసి పోయింది. ఎటుచూసినా జనమే.ఆ ఇరుకులో కూడా సోమయ్య ఒళ్లు మరిచిపోయి నిద్రపోయాడు. చోటుదొరకని పిల్లవాడు ఒకడు, ఇదే చాలని, సోమయ్య భుజాలమీదికి ఎక్కి కూర్చున్నాడు రాత్రంతా. అక్కడి నుండి వాడికి శాస్త్రులవారు బాగా కనిపించారు మరి! ఆ రాత్రి కథ పూర్తయ్యే సరికి, పిల్లవాడు సోమయ్య భుజాలమీది నుండి దిగేశాడు. అందరూ లేచిన అలికిడికి సోమయ్య కూడా లేచి, కండువాదులుపుకొని ఇంటికి వెళ్లాడు. రాత్రంతా మోసిన బరువు వల్ల అతని భుజాలూ, నడుమూ నొప్పి పుడుతున్నాయి. ఇంట్లో భార్య ఎదురొచ్చి "కథ ఎలా ఉందండీ?" అని అడిగేసరికి అతనికి బరువుతప్ప మరేమీ గుర్తురాలేదు. "తెల్లవారే సరికి మరీ మరీ బరువెక్కింది" అని

మాత్రం చెప్పాడు. రంగమ్మ సంతోషపడింది. "రామాయణం అంతే కదండీ, చాలా బరువైన కథ!" అన్నది మురిసిపోతూ. తన మొరటు భర్తకు కూడా రామాయణంలోని భావనల బరువు, లోతు అర్థమైనందుకు ఆమె చాలా సంతోషపడింది.

ఇక ఆ రోజు సోమయ్య వెళ్లేసరికి, ప్రాంగణం అంతా నిండి ఉన్నది. సోమయ్యకు ఎంత నిద్ర వచ్చిందంటే,అతను బయట నేలమీదే కండువా పరుచుకొని నిద్రపోయాడు. బాగా నోరు తెరచుకొని గురక కూడా పెట్టాడు. తెల్లవార బోతుండగా అటుగా వచ్చిన కుక్క ఒకటి,తెరచిన ఆ నోటిని చూసి ముచ్చటపడింది. ఇంకేముంది,కాలెత్తి తనపని కానిచ్చేసింది!!.


వెంటనే మేలుకున్న సోమయ్య కండువాతో సహా ఇల్లు చేరుకున్నాడు. భార్య ఎదురొచ్చి "ఎలాఉంది?" అని అడిగితే సోమయ్య ముఖం ముడుచుకొని, గుడ్లుమిటకరించి, నీళ్లు నమిలాడు-" ఘోరంగా ఉంది! ఉప్ప ఉప్పగా!" అన్నాడు చివరికి.

దాంతో రంగమ్మకి అనుమానం వచ్చేసింది. గుచ్చి గుచ్చి అడిగేటప్పటికి సోమయ్య తను చేస్తున్న పనినంతా ఒప్పేసుకున్నాడు- ప్రతిరోజూ కార్యక్రమంలో బాగా నిద్రపోతున్న సంగతి చెప్పేశాడు. రంగమ్మకి విపరీతమైన కోపం వచ్చేసింది. "పద,ఈ రోజు నీతో పాటు నేనూ వస్తాను. నువ్వెట్లా నిద్రపోతావో చూస్తాను"అని ఆ రోజు రాత్రి సోమయ్యతో పాటు తనూ బయలుదేరింది.

వాళ్లిద్దరికీ ఆ రోజుచక్కగా ముందు వరసలోనే చోటు దొరికింది. రంగమ్మ భర్త చెవిలో ముందుగానే గుసగుసలాడింది:- "నిద్రపోతే చూడండి, ఏం చేస్తానో" అని! దాంతో సోమయ్య నిద్ర మత్తు కాస్తా ఎటుపోయిందో-పోయింది. దాంతో అతను రామాయణ కథలో మునిగి పోయాడు..చూడగా కథ బాగానే ఉన్నట్లున్నది! అందులో పాత్రలన్నీ సోమయ్యకు ఇప్పుడు వాస్తవం అయిపోయాయి! ఆ రోజున శాస్త్రులవారు హనుమంతుడు లంకాదహనం చేసిన ఘట్టం చెబుతున్నారు. "లంకను కాల్చేసిన తర్వాత,


హనుమంతుడు సీతమ్మ ముద్రికను ఇలా వేలికి పెట్టుకొని, అలా ఒక్కగెంతులో సముద్రందాటారు-" అని చెబుతూ శాస్త్రులవారు ఒక్కదూకు దూకారు ముందుకు!

అంతలోనే జరగరానిది జరిగిపోయింది- శాస్త్రులవారి చేతిలో ఉన్న ఉంగరం జారి కోనేటిలోపడిపోయింది.!



సోమయ్య గబుక్కున లేచినిలబడ్డాడు. హనుమంతుడి చేతిలోంచి సీతమ్మవారి ఉంగరం జారి సముద్రంలో పడిపోతే ఇక కథ ఎలా సాగుతుంది మరి?- అందుకని అతను - "స్వామీ! హనుమంతా! కంగారుపడకు! నీ ఉంగరాన్ని తెచ్చి ఇచ్చేందుకు నేను లేనా?" అని అరిచి, ఒక్క ఉదుటున గుడి కోనేటిలోకి దూకాడు. అయితే యీత బాగా వచ్చిన వాడు కనుక, కోనేటి అడుగున పడిఉన్న ఉంగరాన్ని దొరకబుచ్చుకొని మరునిముషంలో పైకి తేలివచ్చాడు. అందరూ నిర్ఘాంతపోయారు-అతని చొరవకు,భక్తితత్పరతకూ! ఉంగరం పోయిందని కంగారు పడుతున్న శాస్త్రుల వారికి ప్రాణంలేచివచ్చినట్లైంది. ఆయన ఉంగరాన్ని అందుకొని అదే వేగంతో దేవునికి హారతి ఇచ్చి, పళ్లాన్ని సోమయ్య చుట్టూ తిప్పి, నొసటన తిలకందిద్ది, పూలమాల వేసి మర్యాద చేశాడు.

దాంతో ఊళ్లో వాళ్లందరికీ సోమయ్య భక్తి పట్ల విపరీతమైన గురి ఏర్పడిపోయింది. రాముడికి,హనుమంతుడికి ప్రీతిపాత్రుడైన వాడిగా వాళ్లంతా సోమయ్యను గౌరవించటం మొదలు పెట్టారు. సోమయ్య కూడా ఆ గౌరవానికి తగినట్లు హుందాగా ప్రవర్తించే సరికి, నిజంగానే పెద్దమనిషి అయిపోయాడు!



# పాలపిట్ట రావే!

రచన: శ్రీ బాలాంత్రపు రజనీకాంత రావుగారు, విశాఖపట్నం.

సౌజన్యం: ఫోరం ఫర్ చైల్డ్ సెంటర్డ్ ఎజుకేషన్, విజయవాడ.

పాలపిట్ట రావే
పలుకాడి పోవే (2)
చిన్ని రెక్క చేతులు మడిచి
సన్న ఎలుగుల మైమరచి
ఆకాశాన తేలిపోతూ
అల్లనల్ల ఎగిరిరావె! "పాలపిట్ట రావే"
తంతి తీగపైన నిలచి
వింతలేమి చెబుతావే?
రైలు బండి గూటిలోన
వాలినేను చూచుచుండ "పాలపిట్ట రావే"
చిన్ని తోక కదలియాడ
చిన్ని గొంతు పాట పాడ
పాట పైకి రాక మునుపే
దాటు వేసి ఎగురుతావె! "పాలపిట్ట రావే!"

# సమతా రాజ్యం!

రచన: కీ.శే.కవికాకిజైసీతారాంగారు, కోగిర, రొద్దంమండలం, అనంతపురంజిల్లా.

రాముా రాముా! పెద్దయినంక ఏమి చేస్తావు?
సమతా రాజ్యం జనతా రాజ్యం సారధినౌతాను.

భీమా భీమా! పెద్దయినంక ఏమి చేస్తావు?
దేశ రక్షణ చేసే సిపాయినౌతాను.

సోముా సోముా పెద్దయినంక ఏమి చేస్తావు?
భూమి దున్ని పండించేటి రైతునౌతాను.

ప్రేమా ప్రేమా! పెద్దయినంక ఏమి చేస్తావు?
విజ్ఞానాన్ని వెలిగించే గురువునౌతాను.



# పదరంగం-6

*ఈ పదరంగం చాలా సులభం! దీన్ని పూరించి పంపండి. మీ పేరుతో బాటు మీ బడి పేరు, తరగతి తప్పక రాయండి. సరైన సమాధానాలు పంపిన పిల్లల పేర్లను పదరంగం-7 తో పాటు ప్రచురించగలం.*
*నిర్వహణ: దేవి, కొత్తపల్లి బృందం.*

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 |
| | ■ | | ■ | 4 | |
| | ■ | 5 | 6 | | |
| ■ | 7 | ■ | | ■ | ■ |
| 8 | ■ | 9 | | ■ | 10 |
| 11 | | ■ | 12 | | |

**ఆధారాలు:**


**అడ్డం:**

1. పరిమళం (4)
4. పది మాత్రమే (2)
5. పంపకం బహువచనం (4)
7. రమ్మని పిలు (1)
9. అత్తని పిలవండి (2)
11. న..న..ననత్తి! (2)
12. పెళ్ళిళ్ళకీ, పేరంటాలకీ ఇంటి ముందు వేసేది (3)

**నిలువు:**

1. సులభం (3)
2. దగ్గర (3)
3. చెవులపిల్లి (3)
6. చేసిన పనికి బాధపడటం (4)
8. వర్షం (2)
10. వేటగాడు ఏదైనా తప్పొచ్చుగానీ, ఇది మాత్రం తప్పకూడదు (2)

**పదరంగం-5 కి సరైన సమాధానం**



దీనికి చక్కగా సమాధానాలు వ్రాసి పంపించిన పిల్లలు:

1. సి.హెచ్.ఆదిత్య, 4 వ తరగతి, గ్రామర్ స్కూల్, హైదరాబాదు.
2. అసంగానంద రెడ్డి, 4 వ తరగతి, అజంతా స్కూల్, నెల్లూరు.
3. జి.సత్యలక్ష్మి, 2 వ తరగతి, చెన్నేకొత్తపల్లి.

# కల!

*బొమ్మకు కథ రాయండి!* *నిర్వహణ: శ్రీమతి జి.లలిత*, telugu4kids.com
*చిత్రం: చీకటి జంగమయ్య, 9 వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా.*



ఈ బొమ్మను చూడండి.

మీకేమనిపిస్తున్నది?

ఏదో కలలాగా ఉంది కదూ?

ఎవ్వరూ లేని ప్రాంతం!

పెద్ద సరస్సు!

ఆకుపచ్చని ఆకాశం!

పచ్చని చెట్టు!

దాని నీడలో 'రా రమ్మని పిలుస్తున్న ఇల్లు!

ఆ యింటికి ప్రక్కన ఉన్నది మరి, పశువుల పాకేనో, మరేదో?!

ఇవన్నీ ఇక్కడ ఎదురు చూస్తున్నట్లున్నై, కదూ? ఎవరికోసం?

మీకు తెలుసనే మా నమ్మకం. ఆ కథని మాకు రాసి పంపండి. బాగుంటే దాన్నే అచ్చు వేస్తాం, రెండు నెలల తర్వాత.

మా చిరునామా: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా-515101
ఫోన్లు: 08559 240222, 7702877670, ఇ-మెయిలు: team@kottapalli.in

# చిలిపిప్రశ్నలు -తిక్క జవాబులు

*నిర్వహణ:శ్రీవి.వి.యస్.మూర్తి, చొదిమెళ్ళ, పశ్చిమగోదావరి జిల్లా.*

1. ఫైర్ఆఫీసర్ 'ఫైర్' అయ్యేదెప్పుడు!?

కడుపు 'మంట'గా వుందని ఓ వ్యక్తి ఫోన్ చేసినప్పుడు!!

2. మిమిక్రీ ఆర్టిస్ట్ ఇంట్లోకి దొంగప్రవేశిస్తే....!?

కుక్కలా అరుస్తాడు!!

3. దేవుళ్ళు కొండలమీదే వెలుస్తారెందుకు!?

స్వచ్ఛమైన ఆక్సిజన్ కోసం!!

4. "సౌండ్"స్లీప్ అంటే......!?

గురకనిద్ర!!

5. మంత్రిగారు ముగ్ధుడయ్యేదెప్పుడు!?

మనవడికి కథచెప్తుంటే వాడు "ఊ" కొట్టకుండా "జై" కొడుతున్నప్పుడు!!

6. వెటర్నరీ డాక్టరు ఇంటిగేటు మీదున్న బోర్డు మీద ఏమనిరాసి వుంది!?

"రేబిస్ వ్యాధి కలిగించే కుక్క వున్నది జాగ్రత్త"

7. "పూలమ్మిన చోట కట్టెలమ్మటం" సామెత పాతదైపోయింది. మరి కొత్త సామెత ఏంటి?

"చెరకు పండించిన పొలంలో వంట చెరకు పండించటం!!"

8. అద్భుతమైన ఆఫర్!?

"తాళంకప్ప కొంటే తాళంచెవి ఉచితం!!

9. కోపంగా ఉన్న ఇల్లాలు ఏంచేస్తుంది?!

పుట్టింటి వాళ్ళొచ్చినప్పుడు టి.వి, అత్తింటి వాళ్ళు వచ్చినప్పుడు రేడియో పెడుతుంది!!


10. చిట్టిపిల్లల తల్లిదండ్రులకు ముందుచూపుతో మీరిచ్చే సందేశం?

వాళ్ళు బడికి వెళ్ళే ముందు హాపీ,

వెళ్ళటం మొదలుపెట్టిన తర్వాత బిపి!!

# సమీక్ష

*కొత్తపల్లి పత్రిక జూలై2011 సంచిక సమీక్ష.*
*నిర్వహణ: శ్రీమతి మాలతీకృష్ణ, విద్యార్థి సృజనకుటీర్, విజయవాడ.*




కొత్తపల్లి పుస్తకం పట్టుకోగానే టపటపమంటూ చినుకులు మొదలైనాయి. దట్టంగా పైన కప్పేసిన చెట్ల ఆకుల సందుల్లోంచి పడుతున్న వాన ఎండిన నేలని తడిపేసింది. కమ్మటి వాసనొచ్చింది. జోరెత్తిన వానలో తడిసి ముద్దయి కాళ్ళక్రింద మెత్తటి బురద జారిపోయింది. గొడుగుల మీద పడుతున్న చినుకులు వింత శబ్దాలు చేశాయి. రివ్వున కొట్టిన చలిగాలి వణికించింది.. అట్టమీద బొమ్మతో పంచేంద్రియాలనూ స్పందింపజేసింది, అడవిరాముడి కుంచె! గొప్ప అనుభూతి వచ్చింది. ఒక సినిమా చూసినట్లైంది.

చదువుల పోటీల్లో నెగ్గుకు రావటానికి పుస్తకాల పురుగులైపోయి ఆటపాటలకీ, ప్రపంచానికీ దూరమౌతున్న పిల్లలకి ఈసారి సంపాదకీయం చక్కటి సందేశాన్నిచ్చింది. కాకపోతే అసలు కథలోని చీమ, మిడత పాత్రల స్వభావాన్ని విషయం చెప్పటానికి అనువుగా మార్చుకున్నట్లుంది. పాతకాలంనాటి మిడత ఒట్టి బద్ధకస్తురాలు, ప్రపంచం పట్టనిదీనూ కదా!

రామ్మోహన్ రాసిన అల్లరి దయ్యాల కథ సరదా సరదాగా ఉంది. పాత జానపద సినిమాల్లో హీరోలు కూడా అలానే చేసేవారు. దయ్యాలంటే భయపడే పిల్లలు ఈ కథ చదివితే- 'ఓస్! ఇంత వెర్రివెంగళప్పలా, దయ్యాలంటే?! వీటిని తల్చుకునా, నేను భయపడింది?!' అనుకోక మానరు.

చెట్లని నరికే రాజులు కోకొల్లలు. వారికి ఏ కారణమూ అక్కర్లేదు, ఆ పని చెయ్యడానికి రవివంటి పిల్లలు ఇంకా ఇంకా కావాలి. మంచి కథ చెప్పావు,నిఖిల్!

'రాక్షసుడితో పోరాటం'లో నువ్వేకదా, శివకుమార్, రాజకుమారుడివి? అందుకే కదా,అతనికి అంత ధైర్యమూ, బలమూనూ?! రాక్షసుడి మీసం పట్టుకొని గిరగిరా తిప్పి విసిరేయగలడా, లేకపోతే? పిల్లలంతే. చెయ్యలేని పనేదీ వున్నట్టనిపించరదు వాళ్లకి. మనకా,. బోల్డన్ని భయాలూ, సందేహాలూనూ.

'ప్రేమ' కథకి ఎంచుకున్న అంశం, పాత్రల నిరాడంబర చిత్రణా, క్లుప్తంగానే ఎంతో చెప్పిన తీరు- ప్రజ్వల్ గొప్ప రచయిత కాగలడనిపించింది. సున్నితంగా సూటిగా మనసుని తాకింది, ఈ కథ.

హైమవతిగారి కథలు ఎప్పుడూ గాఢంగానే వుంటున్నాయి. భాషమీద పట్టు ఉన్నవారు రాసిన చిక్కదనం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఎంచుకున్న అంశంకూడా కొత్తగా ఉంది. మిత్రులైన రాజులు ఇద్దరూ ఒకచోట ఏకవచనంలోనూ, మరోచోట బహువచనంలోనూ సంబోధించుకోవటం గమనింపుకురాని పొరపాటై ఉంటుంది.

పర్తాప్ అగర్వాల్ గారి 'మన ఇల్లు'చెప్పలేనంత బావుంది. ఇష్టంగా చెయ్యని పనులు ఎంత పేలవంగా ఉంటాయో! అలా చెయ్యడం మన ఆరోగ్యానికే కాదు, వ్యక్తిత్వానికీ చెడు చేస్తుంది కదా!

చక్కటి పాటలు అందరికీ అందించటం కొత్తపల్లి చేపట్టిన చాలా మంచి పని. వీటిని మనమంతా మరింతమందికి పంచాలి. పాటలు పాడుకుంటూ పిల్లంతా చిందులేసి ఆనందించాలి. మరిన్ని మంచి పాటలకోసం, ఇంకెన్నో మంచి కథలకోసం ఎదురు చూద్దాం.

**వెల:**

ప్రతి ఒక్కింటికి: 20 రూ.

12 పుస్తకాలకైచందా: 240 రూ.

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.

బ్యాంకు అక్కౌంటు వివరాలు:

"Kottapalli Trust",
A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోన్లు: 08559 240222, 7702877670

ఇ-మెయిలు: team@kottapalli.in

**<u>ఈ నెలలో ఏపని-ఎవరిది?</u>**

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు

సంపాదకత్వం: నారాయణ

వెబ్సైటు, సమాచార సాంకేతికత: ఆనంద్

ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు

చిత్రాలు: వీరాంజి, అడవిరాముడు, శివ, చంద్రకాంత్, ప్రసాద్, అనిల్, వెంకట్, గణేశ్

చిలిపిప్రశ్నలు: వివియస్ మూర్తి.

బొమ్మకు కథ: జి.లలిత, telugu4kids

సమీక్ష: వై.మాలతి. పదరంగం: దేవి

కథలు, పాటలు: చాలామంది పిల్లలు

**<u>ప్రత్యేక కృతజ్ఞతలు:</u>**

కార్టూన్ల వివియస్ మూర్తిగారికి, టింబక్టు బడికి, అరవింద స్కూలుకు, విద్యార్థి సృజన కుటీరానికి, నందన గ్రామీణ పాఠశాలకు, వెంకటేశ్వర బాలకుటీరానికి, telugu4kidsవారికి, మాలతీ కృష్ణగార్లకి, రాధ రాజశేఖర్ గార్లకి, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.

ఇంటర్నెట్‌లో http://kottapalli.in వద్ద కొత్తపల్లి పత్రికను చదవండి.

అందరు పిల్లల కోసం మీరూ కథలు రాసి పంపండి.

చందాదారులుగా చేరి నెల నెలా కొత్తపల్లిని పోస్టులో మీ ఇంటికి తెప్పించుకోండి.

మీ మిత్రుల తరపున చందాలు కట్టండి.

మీకిష్టమైన బడులకు, గ్రంథాలయాలకు కొత్తపల్లిని బహూకరించండి.




Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559 240222 E-mail: team@kottapalli.in .

మంచి పుస్తకం

# ఇట్లు, నాన్న

మీ అమ్మానాన్నలు గానీ, అమ్మమ్మలుగానీ, స్నేహితులుగానీ ఎవరైనా మీకు ఉత్తరాలు రాశారా? ఎవరి ఉత్తరం కోసమో ఎదురు చూస్తూ గడిపారా, మీరు ఎప్పుడైనా?

ఈ మధ్య టెలిఫోన్లూ, సెల్‌ఫోన్లూ, ఇ-మెయిళ్ళూ వచ్చాక, ఉత్తరాలు బాగా తగ్గిపోయాయి. పోస్టు కార్డులైతే మరీనూ- అసలు మాయమే అయిపోయాయి.

పోస్టు కార్డుల నేపథ్యంతో ఎంతో చక్కని కథలు రాసిన పెద్దవాళ్ళు ఇప్పటి పరిస్థితిని చూసి ఏమనుకుంటారో..?

ఇట్లాంటప్పుడు కూడా, వాటి అవసరాన్ని గుర్తించాడు, ఒక నాన్న.

దూరంగా బళ్ళో చదువుతున్న కొడుక్కి రోజూ ఒక పోస్టుకార్డు రాయటం మొదలు పెట్టాడు.

ఆ ఉత్తరాల్లో వాడికి నచ్చే జోకులూ, చిట్టి కథలూ, చిత్రాలూ, వాడికి పనికొచ్చే సామాజిక, శాస్త్ర విజ్ఞాన అంశాలూ- ఇట్లా తనకు తోచినవి, తనకు నచ్చినవి, అన్నీ రాశాడు. ఒక్కో ఉత్తరాన్నీ ఒక చక్కని రంగుల బొమ్మలా తీర్చి దిద్దాడు.

ఈమధ్యే ఆ ఉత్తరాలు కొన్నిటిని కలిపి చిన్న పుస్తకంలాగా వెలువరించాడు, అందరికోసం.

ఆ ఉత్తరాలు మాకు నచ్చాయి. మీకూ నచ్చుతాయి బహుశ:! చదవండి!

**"ఇట్లు, నాన్న"**
రచన: సోమిరెడ్డి
ప్రచురణ: తేజ టాలెంట్ స్కూలు,
కోదాడ, నల్గొండ జిల్లా.
ఫోను: 08683 253388
వెల: ఇరవై ఐదు రూపాయలు

